శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సంపూర్ణ గ్రంథావళి

125వ జయంతి ప్రచురణలు

# శ్రీ వేంకటేశ్వర స్తుతిరత్నమాల

**సంకలనం**
**శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి**

ప్రచురణ
శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
2012

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సంపూర్ణ గ్రంథావళి

125వ జయంతి ప్రచురణలు

# శ్రీ వేంకటేశ్వర స్తుతిరత్నమాల

**సంకలనం**
**శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి**

ప్రచురణ
శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
2012

**SRI VENKATESWARA STUTIRATNAMALA**
**by**
**Sri Veturi Prabhakara Sastri**

**T.T.D. Religious Publications Series No.**

**© All Rights Reserved**

**2012**

**Copies : 1000**

**Price.Rs.........**

**Published by**

**Sri L.V.Subrahmanyam,I.A.S.,**
**Executive Officer,**
**Tirumala Tirupati Devasthanams,**
**Tirupati -517 501**

**D.T.P. SVPSVP, T.T.D. Tirupati.**

**Printed at**
**Tirumala Tirupati Devasthanams, Press.**
**Tirupati.**

ఓం నమో వేంకటేశాయ

# ముందుమాట

**ఎల్.వి. సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్.** - 12-2012
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు,
తిరుపతి.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు జగద్విఖ్యాత శతావధానులగు శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారి శిష్యరికంలో సంస్కృతాంధ్ర సాహిత్యములను అభ్యసించారు. అపారమైన పాండిత్యాన్ని సంపాదించి సుప్రసిద్ధ పండితునిగా, కవిగా, విమర్శకునిగా, పరిశోధకునిగా, బహుగ్రంథపరిష్కర్తగా ప్రసిద్ధిని పొందారు. మాస్టర్ సి.వి.వి గారి యోగసాధనలో సిద్ధులై వారి యోగవిద్యతో వ్యాధిగ్రస్తులైనవారి నెందరినో రక్షించి వారికి ప్రాణభిక్ష పెట్టిన మహనీయులు. మహాతపస్వి.

శ్రీ శాస్త్రిగారు మొదట మదరాసులో తెలుగుపండితునిగా కొంతకాలం పనిచేశారు. పిమ్మట 1910 నుండి 1939 వరకు మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారంలో తెలుగుపరిశోధక పండితపదవి నలంకరించారు. ఆ 29 సం॥ల కాలంలో వారు పరిశోధకులకు పంటపొలాలన దగిన అముద్రిత గ్రంథ వివరణసూచికలు ( Descriptive Catalogues ) 20 సంపుటాలు నిర్మించారు. శాస్త్రిగారు ఆ కాలంలో స్వయంగా 20కి పైగా ఉత్తమ పరిశోధన గ్రంథాలు పరిష్కరించి ప్రచురించారు. తర్వాత తి.తి.దే ఓరియంటల్ కళాశాలలో ఆచార్యులుగా పనిచేశారు. ఎంతోమంది శిష్యులను పండితులుగా తీర్చిదిద్దారు. వారికి జ్ఞానభిక్షను ప్రసాదించారు.

బహుముఖప్రజ్ఞాశాలి, ఉత్తమ పరిశోధకులు, ఆత్మదర్శనులు, నిరంతర యోగసాధకులు, కవి, రచయిత, శాసన పరిశోధకుడు అయిన శ్రీ ప్రభాకరశాస్త్రిగారి సాహిత్యకృషిని గుర్తించి తి.తి.దేవస్థాన యాజమాన్యం 2007వ సం॥లో శ్వేతభవనంలో "శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయ పీఠాన్ని" స్థాపించి, వారు రచించిన ముద్రిత, అముద్రిత గ్రంథాలను తి.తి.దే ద్వారా ప్రచురించి ఆంధ్రసాహితీ లోకానికి అందించడానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు ఈ పీఠం "తెలుగుమెఱుగులు, మీగడతఱకలు, సింహావలోకనము, పూలవిందు, ప్రజ్ఞాప్రభాకరము-గురుపూజ, అన్నమాచార్యచరిత్ర పీఠిక, కేయూరబాహుచరిత్ర, వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయసూచిక" అనే గ్రంథాలను ప్రచురించింది.

ప్రస్తుతం ఫిబ్రవరి 7, 2013 వ తేదీన శ్రీ ప్రభాకరశాస్త్రిగారి 125వ జయంతి సందర్భంగా శాస్త్రిగారి "శ్రీ వేంకటేశ్వర స్తుతిరత్నమాల" అనే గ్రంథాన్ని శ్రీ ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం ద్వారా తి.తి.దేవస్థానం ప్రచురించింది. ఈ గ్రంథంలో ప్రాచీనాంధ్ర కవులు శ్రీ వేంకటేశ్వరస్వామి వైభవమును, ఏడుకొండల మహిమను వర్ణిస్తూ స్తుతించిన పద్యములు గలవు. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం కోరికపై శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఆయా ప్రాచీనాంధ్ర గ్రంథములలోని ప్రశస్తరచనలను సేకరించి ముద్రించారు.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారి 125వ జయంతి సందర్భంగా ఆవిష్కరింప బడుతున్న ఈ గ్రంథమును శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులందరు తప్పక నిత్యపారాయణగ్రంథంగా భావించి పఠించగలరని ఆశిస్తున్నాము.

**(ఎల్.వి. సుబ్రహ్మణ్యం)**

## విషయసూచిక


| విషయము | పుటలు |
|---|---|
| 1. తాళ్లపాక పెద్దతిరుమలాచార్యుఁడు | 1 |
| 2 ఎఱ్ఱాప్రెగ్గడ | 7 |
| 3. సుంకసాల నృసింహకవి | 10 |
| 4. పింగళి సూరనార్యుఁడు | 16 |
| 5. సిద్ధిరాజు తిమ్మరాజు | 20 |
| 6. తరిగొప్పుల మల్లన | 21 |
| 7. చెళ్లపిళ్ల నరసకవి | 25 |
| 8. కాకమాని మూర్తికవి | 28 |
| 9. రేవణూరి వెంకటాచార్యులు | 35 |
| 10. తాళ్లపాక అన్నమాచార్యుఁడు | 45 |
| 11. కృష్ణకవి | 49 |
| 12. వెంకటాచల విలాసము | 52 |
| 13. గణవరపు వెంకటకవి | 58 |
| 14,15 తిరుపతి వెంకటేశ్వరకవులు | 67 |
| 16. వేటూరి ప్రభాకరశాస్త్రి | 72 |


# శ్రీవేంకటేశ్వర స్తుతిరత్నమాల

## 1

## తాళ్లపాక పెదతిరుమలాచార్యుఁడు

ఈతఁడు 16వ శతాబ్దమువాఁడు. తండ్రి అన్నమాచార్యులు. తల్లి అక్కాంబ. జన్మస్థానము రాజంపేట తాలూకాలోని తాళ్లపాక. ఈతని కృతులు శృంగార సంకీర్తనలు. అధ్యాత్మ సంకీర్తనలు, శృంగార దండకము, చక్రవాళ మంజరి, శృంగారవృత్తశతకము. శ్రీవేంకటేశోదాహరణము, నీతిసీస శతకము, సుదర్శనరగడ, రేఫఱకారనిర్ణయము, ఆంధ్రవేదాంతము (ద్విపద). ఆంధ్రహరివంశము, భగవద్గీత(వచనము), వేంకటేశ్వర వచనములు, శ్రీవేంకటేశ్వరప్రభాతస్తవము. యావజ్జీవము పరమభాగవతుఁడుగా గాలక్షేపమొనర్చిన మహనీయుఁడు. ఈతనికి వేదాంతాచార్య, కవితార్కిక కేసరి, శరణాగత వజ్రపంజర బిరుదములు గలవు. శ్రీవేంకటేశ్వర ప్రభాతస్తవము పూర్తిగా నీక్రింద నీయబడినది.

శ్రీగురుండర్థితో శేషాద్రియందు
యోగనిద్రాకేళి నున్న యత్తఱిని
వనజాసనాది దేవత లేఁగు దెంచి
వినుతించిరప్పు డవ్విధ మెట్టిదనిన
శ్రీకర! వేంకటక్షితిధరావాస!
నాకేంద్రనుత రమానాథ మేల్కనుము!
వసుదేవదేవకీ వరగర్భజాత
కిసలయాధర రామకృష్ణ మేల్కనుము!
తపము పెంపున యశోదానందులకును
గృపతోడ శిశువైన కృష్ణ మేల్కనుము!

---

*1945 సం॥లో శ్రీ వేంకటేశ్వర వచనములలో అచ్చయినది.

పూతనాకైతవ స్ఫురిత దుర్వార
చైతన్యహరణ ప్రశస్త మేల్కనుము !
అఱిముఱి శకటాసురాంగంబు లీల
విఱుగఁ దన్నిన యదువీర! మేల్కనుము !
సుడిగాలిరాకాసి స్రుక్కడంగించి
కెడపిన యదుబాలకృష్ణ మేల్కనుము !
మద్దులఁగూల్చి యున్మదవృత్తి మెఱయు
ముద్దుల గోపాలమూర్తి మేల్కనుము !
అద్రిరూపంబైన యఘదైత్యుఁజంపి
రౌద్రంబు మెఱయు భూరమణ మేల్కనుము !
ఆననంబునఁ దల్లి కఖిల లోకములు
పూని చూపిన యాది పురుష మేల్కనుము !
ఖరధేనుకాసుర క్రకచ మేల్కనుము !
వరగర్వఘనబకవైరి మేల్కనుము !
చతురాననుఁడు వత్సమితి నొంచినను
బ్రతియొనర్చిన పరబ్రహ్మ మేల్కనుము !
గురుతర గోపాల గోపికాయాస
తరణ గోవర్ధనోద్ధరణ మేల్కనుము !
కాళియ ఫణిఫణాంగణనృత్యరంగ
లాలితచరణ విలాస మేల్కనుము !
అతుల కుబ్జామనోహరుఁడ మేల్కనుము !
చతురమాలాకార శరణ మేల్కనుము !
వనజాక్ష! యక్రూరవరద మేల్కనుము !
వినయవాక్యోద్ధవవినుత మేల్కనుము!
కోకలిమ్మన్నఁ గైకొనకున్నఁ బట్టి
చాకిఁ గొట్టిన యట్టి సరస మేల్కనుము !



భుజవిక్రమ క్రమస్ఫూర్తిమై భోజ
గజముఁ జంపిన బాహుగర్వమేల్కనుము !
జెట్టి పోరనుగిట్టి చీరి చాణూరు
చట్టలు వాపిన శౌరి మేల్కనుము !
శంసింప జగదేకశరణంబ వైన
కంసుని తలగొండు గండ మేల్కనుము !
మానిత సామ్రాజ్య మండలి నుగ్ర
సేను నిల్పిన ధర్మశీల మేల్కనుము !
పరలోకగతులైన బాలురఁ దెచ్చి
గురునకిచ్చిన జగద్గురుఁడ మేల్కనుము !
చండ భారతరణచాతుర్య ధుర్య
గాండీవిసారథ్య కరణ మేల్కనుము !
బలభేది భేదించి పారిజాతంబు
నిలకుఁ దెచ్చిన జగదీశ ! మేల్కనుము !
బాణబాణాసనోద్భట భీమబాణ
పాణిఖండన చక్రపాణి మేల్కనుము !
రాజసూయమున శూరతఁ జైద్యుఁ దునిమి
పూజలందిన జగత్పూజ్య మేల్కనుము !
మురనరకాసుర ముఖ్య దానవులఁ
బొరిగొన్న యదురాజపుత్త్ర మేల్కనుము !
వీరకౌరవసభ విశ్వరూపంబు
ధీరతఁ జూపిన దేవ! మేల్కనుము!
ఇంపునఁ బృథుకంబు లిడిన కుచేలు
సంపన్నుఁ జేసిన చతుర! మేల్కనుము !
దారుణభూభార తరణావతార
భూరిప్రతాపవిస్ఫురణ మేల్కనుము !

సదమలానంద! నిశ్చయముల కంద !
విదురుని విందు! గోవింద! మేల్కనుము !
భోజకన్యాముఖాంభోజ ద్విరేఫ
రాజీవనయనాభిరామ ! మేల్కనుము !
వరరూపవతి జాంబవతితోడి రతుల
నిరతిమై నోలాడు నిపుణ! మేల్కనుము !
మంజుల సత్యభామామనస్సంగ
రంజితగాత్ర సంరంభ మేల్కనుము !
లలిత కాళిందీవిలాసకల్లోల
కలిత కేళీలోల ఘనుఁడ మేల్కనుము !
చారుసుదంతా విశాలాక్షి కుముద
సారప్రభాపూర్ణచంద్ర! మేల్కనుము !
నేత్రరాగవిశేష నిచిత ప్రతోష
మిత్రవిందారసోన్మేష! మేల్కనుము !
భద్రానఖాంకుర బాలచంద్రాంక
ముద్రిత భుజతటీమూల! మేల్కనుము !
లక్షణాపరిరంభ లక్షితోదార
వక్షోవిశాలకవాట! మేల్కనుము !
వేడుకఁ బదియాఱువేల కామినులఁ
గూడి పాయని పెండ్లికొడుక! మేల్కనుము !
కలిత నక్రగ్రాహగంభీరజలధి
వలయిత ద్వారకావాస! మేల్కనుము !
జలదనీలశ్యామ! జగదభిరామ
వెలయ మేల్కను మంచు విన్నవించుటయు
వీనులఁ గదిసిన వెలిదమ్మికన్నుఁ
గోనల నమృతంబు గురియ మేల్కాంచి



సరసిజాక్షుఁడు దేవసంఘంబు మీఁద
కరుణాకటాక్షవీక్షణము నిగుడ్చి
శ్రీ వేంకటాచల శిఖర మధ్యమున
సౌవర్ణ మణిమయ సౌధంబు లోన
పూగ చంపక కుంద పున్నాగ వకుళ
నాగరంగప్రసూన విరాజమాన
తరులతా పరివేష్టితం బైన యట్టి
నిరుపమ కోనేరి నిర్మలాంబువులఁ
దిరుమజ్జనంబాడి దివ్యాంబరంబు
ధరియించి దివ్యగంధము మేన నలఁది
నవరత్నమయ భూషణంబులు దాల్చి
వివిధ సౌరభముల విరులోలి ముడిచి
ధారుణీ సురులకు దానంబు లొసఁగి
చేరి యక్షతములు శిరసునఁదాల్చి
వినుతులు గావింప విబుధ సన్మునుల
మనవులు విని వారి మన్నించి మించి
యగణితరత్న సింహాసనారూఢుఁ
డగుచు మేరువు మీఁది యభ్రంబు వోలెఁ
గరకంకణోజ్జ్వలక్వణనంబు లెసగ
సరసిజముఖులు వెంజామరల్ వీవ
బంగారు గుదియల పడవాళ్లు దొరలు
భంగించి యటు బరాబరులు సేయంగ
నారదవీణా నినాదంబు లెసగ
చారణ మునిసిద్ధ సంఘంబు గొలువ
నానాప్సరస్సతుల్ నాట్యముల్ సేయ
మానవేశులు మహామహులు సేవింప

ఘనతర నిత్యభోగంబులు వెలయ
జనుల కెల్ల మహాప్రసాదంబు లొనరc
గోరిన వారికిc గోర్కు లీడేర
నీరీతి జగముల నేలుచు నుండు
నని భక్తిcదాళ్లపాకాన్నమాచార్యు
తనయుండు తిమ్మయ తగc బ్రస్తుతించె
నేచి యీకృతి ధరణీశుల సభల
నాచంద్రతారార్కమై యొప్పుcగాక!

# 2
# ఎఱ్ఱా ప్రెగ్గడ

ఈతcడు 14వ శతాబ్దమువాడు. తండ్రి సూరనార్యుcడు. తల్లి పోతమాంబ. జన్మస్థానము నెల్లూరుజిల్లాలోని గుడ్లూరు. ఈతcడు ప్రోలయ వేమారెడ్డి యాస్థానకవీశ్వరుcడుగా నుండెను. ఇతనికి శంభుదాసుcడని ప్రబంధ పరమేశ్వరుcడని బిరుదములు గలవు. భారతారణ్యపర్వశేషము, నృసింహపురాణము, హరివంశము, రామాయణము లీతని కృతులు. ఈ స్తుతిపద్యములు నృసింహపురాణము లోనివి. బ్రహ్మాండపురాణోక్తమయిన శ్రీ నరసింహావతారకథ యిందలి యితివృత్తము. ఈ గ్రంథము అహోబిలనరసింహస్వామి కంకితమీయcబడినది.

క॥ అందంద చాగి మ్రొక్కుచు
బృందారకులధికభక్తి భీతవికాసా
నందంబులు డెందంబుల
సందడిగొన మస్తక ప్రశస్తాంజలు లై

క॥ ఆ విశ్వరూపరూపము
భావించుచుc దత్ప్రభావభంగుల మది సం
భావించుచుc దత్పరమతు
లై వినుతింపంగc దొడcగి రప్పరమాత్మున్.

ఉ॥ శ్రీవసుధాకళత్ర! యతసీసుమనోతిమనోజ్ఞగాత్ర! మా
యావిహితత్రిలోక! నిగమార్థవివేకవిపాక! భవ్యసం
సేవకసౌమ్యమానసవశీకృతరూప! భవాంధకారని
ర్ధావనదీప! దీప్తనవతామరసేక్షణ! విశ్వరక్షణా !

చ॥ భవ దురునాభిరంధ్రభవపద్మరజఃపరిమాణపాకసం
భవుఁడు విధాత తద్విమలభావకళాకణమాత్రవైభవో
ద్భవము జగంబు తద్వివిధ భంగిక సర్గములోన నొక్కరుం
డివి యని నిశ్చయింపగలఁడే ! భవదీయ గుణంబు లచ్యుతా

ఉ॥ ఎందును నిన్నుఁగన్న జనులెందును గల్గరు వెండి యెద్దెసం
జెందవు నిన్ను నెద్దెసలఁ జెందని కించుకభక్తి నొక్కటన్
బొందు గొనంగఁజాలు కృతపుణ్యులు గల్గినఁ జాలు వారికిన్
బొందగునీ లసత్కరుణ పుణ్యయశోమహనీయ మాధవా!

శా॥ విన్నంజాలు భవన్మహత్త్వము భవద్విజ్ఞాన సద్గోష్ఠిలో
నున్నంజాలు భవత్పదాంబురుహ సేవోత్సాహ సంపన్నులం
గన్నంజాలు భవత్సమంచిత జగత్కల్యాణనామంబుఁ బే
ర్కొన్నంజాలు నరుండు శాశ్వత శుభారూఢుండు లక్ష్మీశ్వరా!

ఉ॥ అక్షరయోగయుక్తులు సమంచిత సత్యదయానురక్తులా
లక్షిత సర్వధర్ములు విలంఘితసర్వధర్ములు బుద్ధి కల్పితా
పాక్షరవాక్యరూపులు నిరాకృతకోపులు సంయమ క్షమా
శిక్షితు లక్షయుల్ నిను భజించు మహాత్ములు నీరజోదరా!

చ॥ తమతమ పూర్వవాసనలఁ దత్పరులై వివిధాగమోక్త కృ
త్యములు వహించె భవ్యపరతత్త్వము నయ్యయి సంజ్ఞలం బ్రయ
త్నమునఁ దలంచు సంయతమనస్కుల కెల్లను జేరుచోటు శ్రీ
రమణ భవత్పదంబు సుచిరస్థితి నేళుల కబ్ధిచాడ్పునన్.

ఉ॥ విద్యల కెల్ల నాద్యుఁడును, వేద్యుఁడునై తనరారు నిన్ను న
భ్యుద్యత కర్మరూపముగ నుల్లమునం దలపోసి యెంతయుం
జోద్యపు భక్తి యజ్ఞపురుషుడని పూనిభజింతు రెందుఁ ద్రై
విద్యులు నాకలోకపదవీపదదీ(?) ప్ర త్రిలోకనాయకా.



శా॥ దృష్టాదృష్టఫలస్పృహావిముఖులై దిక్పూర్వతత్త్వ క్రియా
సృష్టిం బ్రస్ఫుటతీవ్రబోధమున నుత్సేకించి యవ్యక్తసం
సృష్టిన్ బాసి నిరస్త వైకృతు నుదాసీనాత్ము షడ్వింశు వి
సృష్టైశ్వర్యుని నిన్ను సాంఖ్యులెలమిన్ భావింతు రాత్మేశ్వరా!

చ॥ యమనియమాభివర్ధితములై మగుడంగ మనశ్శరీరముల్
శమితముగా మరుచ్చయము సంతతజీవపరాత్మతత్త్వరూ
పములు విభేదమై మఱపు పాటిలి కాలముమ్రింగి యోగివ
ర్గము గను చిత్సుఖానుభవగర్వము సర్వము నీవ కేశవా!

చ॥ పరగు పదార్థపంచకము పాశములై తనుఁజుట్టఁ దూలుచున్
దిరిగెడు జీవుఁడున్ బశువు దేశికపుణ్యకటాక్షవీథిఁ ద
త్పరమతిఁ జేరఁగా నపరబాధవిముక్తి శుభంబు నిచ్చు నీ
శ్వరుఁడుగ నిన్నెఱుంగుదురు శైవులు శాశ్వతచిన్మయాత్మకా!

ఉ॥ దాస్యమొకందునుం బరమధర్మముగాఁ గొని యన్యధర్మ మా
శాస్యముగా గణింపక యసంశయనిశ్చలభక్తిసంతతో
పాస్యు నశేషభవ్యపురుషార్థ భవైకవిధాయి నిన్ననా
లస్యతఁ బాంచరాత్రులు దలంచి భజింతురు భక్తవత్సలా!

# 3
# సంకుసాల నృసింహకవి.

ఈతడు 16వ శతాబ్దమువాఁడు. తల్లిదండ్రులపేరు, నివాసస్థానము యెఱుఁగరాదు. భట్టరుచిక్కాచార్యుల శిష్యుఁడనని చెప్పుకొన్నాఁడు. తన గ్రంథమును శ్రీరంగనాథునకంకితమిచ్చినాఁడు. మాంధాతృచరిత్రమిందలి యితివృత్తము. కవిత్వము సంస్కృతపదభూయిష్ఠముగానున్నది.

## కవికర్ణ రసాయనము

వ॥ ఇట్లు గరుడవాహనరూఢుండై యారూఢదివ్యముని సేవ్యమానుండై యఖిలభువనావనదక్షుండై పుండరీకాక్షుండు ప్రత్యక్షంబగుటయు.

శా॥ హర్షాశ్చర్యభయంబు లుప్పతిల సాష్టాంగంబుగా మ్రొక్కి యు
త్కర్షింపంగఁ దరంబుగాని యొకయంతస్సౌఖ్యమున్ బొందిపై
వర్షింపం బ్రమదాశ్రుపూరము కరద్వంద్వంబు నొక్కొంతగా
శీర్షంబుం గదియించి సాంద్రపులకశ్రేణీపరీతాంగుఁడై.

దండకము॥ శ్రీవల్లభా! గల్లభాగద్వయీదర్పణాత్యర్పణాలోక! లోకత్రయత్రాణలీలాకళాదక్ష! దక్షాత్మజాభర్తృచూళీ పరిష్కారమందార మాలాభవత్పాద నిర్యత్పయోధార! ధారా సహస్రాంశుదీప్తప్రభాభార దూరీకృతారాతి దైతేయనాథావరోధాంజన ధ్వాంతథాంతాన! సంతాన భూజప్రభాపాదపార్థిప్రజాభీష్ట వస్తు ప్రదానప్రశస్తా! సమస్తాత్మభావాను భావంబు నీవంబుజాతాక్ష! కైకొన్న పైకొన్ననీమాయ నేమాయధామానముం గానఁ గా లేక నానానుసంధానసంధాను బంధానుబంధాంధ కారంబుచే నిన్నెఱుంగండెఱుంగందరంబా? భువింజిత్తగర్తంబునం గర్వతాహంకృతిన్ జీవబీజంబు సంకల్పరూపాంకురం బొచు నుద్దామకామాదికాండ



ప్రకాండంబు లడ్డంబుగాఁబుత్రమిత్రాది పత్రంబులన్ జొంపమై సంపదల్ మవ్వపుం గ్రొవ్విరుల్గా బునర్జన్మకృద్బీజ సంయోజనామాత్ర పాత్రంబుగాఁ గర్మ మర్మంబునం బండనొండొంటి కంటైన యీ మేనులన్మానులం దట్టమైనట్టి నిస్సారసంసారఘోరాటవీవాటిక న్నిర్గమింపంగ మార్గంబు లేకెమ్మెయిం ద్రిమ్మరం గండ్లుముండ్లుంగొనన్ నొప్పిచే నెవ్వగం గూలుచుం దూలుచుం దద్వ్యపాయం బుపాయంబునం జెందుటానందమై తోఁచు నందందమై నింద్రియద్వంద్వ సంప్రాప్తిచేఁ దప్తులమ్మైన మా నేరముల్ దూరముల్ జేసి, యాశీవిషాధీశశయ్యా! మదీయాపదల్ వాపవే! పాపవేగోదయంబింక మిమ్మింక నాలింపఁ బాలింపఁగా దిక్కుదక్కెవ్వరే! నవ్వరే చీఁకునుంజీకుఁ జేయూఁతఁగాఁ జేఁత! కీదృశ్య విశ్వంబునం దత్ప్రభావంబు భావంబు నందానకానంగ లేఁడొక్కరుం డొక్కరున్ముక్తునిం జేయఁగా శక్తుఁడే? యుక్తి సంధిత్సమాత్సర్య బద్ధైకబుద్ధి న్వికల్పించి కించిత్పరిజ్ఞానముం గానఁగా లేని దుర్వారదుర్వాదు లంగాదనంజాలి లీలా కలోత్సేకతన్నైక తాపాద్యమానుండవై యెన్నసుద్యోగివై నీతవిద్యాగతిన్ లోకమున్ దూరితాలోకముంజేసి చీకాకుగాఁగాకు సేయంగ నేపోకలంబోక యేకాకులై యాకులైశ్వర్య కార్యంబు వర్జించి పంచేంద్రియాదిప్రపంచంబు నిర్జించి మోహంబులంగోసిదేహంబులన్ బూర్ణగేహంబులన్ రోసి శీతాతపాభీరులై జీర్ణపర్ణానిలాహారులై ఘోరతీవ్రప్రభాచారచాతుర్య ధుర్యుల్మహా యోగివర్యుల్సదాగాఢసంబోధ సంబాధనిర్బాధహృద్వీథులన్ నిన్ను శోధించుయున్ గట్టిగాఁ బట్టలేరన్న మమ్మెన్నఁగానేల! యేలావృథాగాథ లింకన్? భవాంధాంధు మూలంబులం గూలి యుక్కేదిదిక్కేదియున్ లేని మూఢుల్నిరూఢాను కంపాగుణావిద్ధులం జేసి నీ వుద్ధరింపంగఁదా రెందయున్ నీపదారాధనాసాధనాసక్తులై భక్తిసంయుక్తులై ముక్తులై శుద్ధమిద్ధంబు వేదప్రసిద్ధం బనూయం బమానం బమేయం బజేయం బవాచ్యం బమోచ్యం బనాశం బనీకాశమేసౌఖ్య మాసౌఖ్యముంగాంతు రబ్జాలయాకాంత! యేత్రంతలన్ ప్రంతలన్ రంతలన్ జెందలేన్గుందలేనింక నేఁగింకరత్వంబు తత్త్వంబుగాఁ జూచెదన్ దాస్యమాశాస్యముగా నపేక్షించెదన్ భృత్యకృత్యంబు నిత్యంబుగాఁ గోరెదన్

సేవకత్వంబు సత్యంబుగా నెంచెదన్ దావకీయార్ద్ర నిర్హేతుకారుణ్యగణ్యైకవీక్షం గటాక్షింపవే! శిష్టరక్షాపరా! దుష్ట శిక్షాకరా! ధర్మసంస్థాపకా! శర్మసందీపకా! భక్తకర్మచ్ఛిదా! ముక్తి మర్మప్రదా!

సీ॥ తృష్ణాపరుండైన తెరువరి తియ్యని
మున్నీటిసలిలంబు లెన్ని గ్రోలు
నిరుపేద యగువాఁడు నిర్జరగిరిఁ జేరి
జాతరూపం బెంత సంగ్రహించు
గణనాపరుండైన గణకుండు సమకొని
రిక్కలనెన్నింటి లెక్క వెట్టు
లంఘనోన్ముఖుఁడైన జంఘాలుఁడొక్కరుం
డిమ్మహీవలయంబు నెంత గడుచు

గీ॥ నట్టిదయ పోయనంతకల్యాణగుణ స
మృద్ధుఁడగు నిన్ను ననుబోఁటి యెంత పొగడు
నెంతమాత్రయుఁ బొగడుట కేదియెఱుక?
యెఱుక నేఁడిఁకఁ గలుగునే? యీశ్వరేశ!

చ॥ తొలుదెసవేల్పుమానికపుఁదోరపుఁగాంతికి మేలుబంతి క్రొ
మ్మొలకమొయిళ్ల వన్నియలమొల్లమికిందగుపుట్టినిల్లు గుం
పులుగొనుతోరపుంబసిమి బూమియచూపువిడంబనంబు నీ
బలితపుమేనిచాయ కనుఁబండువు నా కొనరించెనచ్యుతా!

చ॥ అసుజలవర్గముం జలరుహంబులు నీశ్వర! తారుశారదో
ల్లసనముఁబూనియైన నవిలంఘ్యతమఃకృతమీలనంబు రా
జసవృత్తి కల్మి యందలి ప్రసాదమునొందక యుండునట్టి నీ
యసమపదాబ్జయుగ్మ మలరారెడు మామకమానసంబునన్



చ॥ సురనదికంటెఁదార తొలుచూలుసుమీ యని యెల్లవారికిన్
జిరతరధాళధళ్యమునఁ జెప్పక చెప్పెడు భంగిఁ బొల్చు నీ
చరణ బిసప్రసూన నఖచంద్రమరీచులు పర్వి నా మదిం
దొరలు తమంబు వోనడిచెఁ దోయరుహోత్పల బంధులోచనా!

చ॥ సిరియును ధాత్రియున్ శయకుశేశయయుగ్మములం బ్రవీణలై
సరసత నొత్తుచోఁ బొదలి సంకులముత్పులకాంకురావళుల్
బెరసిన యప్పుడీమెఱుగుఁబిక్కలు నిక్కము దాల్పకుండునే
యురగశయాన! పాదకమలోచితకంటకనాళ భావమున్?

ఉ॥ అందములైన నీ తొడల యాకృతిశోభ వహింపలేని యా
నిందకుఁజాలమిం నిలువు నీఱగు టెంత యనంటికంభముల్
నందిత భక్తలోకయతులంబగు నీ భవదూరుసామ్యముం
బొందఁదలంచు ధూర్తమతిఁబొందె నధోగతి హస్తిహస్తముల్

ఉ॥ కన్నులపండువై ధగధగం జిగిరంగుఁ దుఱంగలింపఁగాఁ
జెన్ను వహించు నీ పసిఁడిచేల వహించిన నీలవర్ణ! నీ
యిన్నెఱిఁ జూడ మీఁదినగమెల్ల ఘనాఘనపంక్తి పర్వి పై
కొన్న మెఱుంగుబంగరువుకొండగతిం దిలకించె నెంతయున్.

ఉ॥ లోకములెన్ని యన్నియును లోఁగొనియుం దనలేమిఁజూపు నీ
యీకృశమధ్యభాగ మిపు డీక్షణలక్ష్యముగా దటంచు నే
నో కమలేశ ! లేదనుట యుక్తముగా దలబ్రహ్మఁగన్న నా
ళీకముతోడి పొక్కిలికి లేమి ఘటిల్లెదునట్లు గావునన్.

చ॥ పొలుపుగ మధ్యదేశమునఁ బూనిన కౌస్తుభ మెఱ్ఱచాయలన్
ధళధళితద్యుతుల్ గొలుప దైత్యవిమర్దన! నీయురంబు ని
ర్మలరుచి గూడఁ బొల్చె నడుమం బ్రతిబింబిత బాలభానుమం
డలము వెలుంగఁబొల్చుయమునానది గన్న హ్రదంబు కైవడిన్

చ॥ దళితమహేంద్రనీలరుచిదాయకవిగ్రహ! నీ గభీరతా
జలనిధిభావముం దెలుపఁ జాలిన లక్షణలక్షితంబులై
యలవడెఁ గంకణాంకితములై సముదంచితశంఖచక్రసం
కలితములై యభంగపరిఘాసమతుంగ భుజాతరంగముల్

చ॥ తన సుషమావిశేషములఁదప్పక శంఖములన్ జయించుటం
దనికిన కీర్తిరేఖల విధంబున నుజ్జ్వలకాంతిఁబొల్చు నీ
యనుపమ తారహారలతికాపరికల్పితవేల్లనంబుచేఁ
గనుఁగొన నొప్పు నీ కిపుడు కంధరకంధరవర్ణ బంధురా!

చ॥ వెడవెడ క్రొత్తక్రొత్తమొగి విచ్చిన కెందలిరాకుఁ గెంపు చూ
పెడు జిగిగల్గు నీ యధరబింబమరీచులు దొంగలింప నీ
బెడఁగు వహించు నెమ్మొగము పేరిటి పున్నమ చందమామకున్
సడలని దట్టపుం బొడుపుఁజాయ ఘటించెడు నంబుజోదరా!

చ॥ తిలకిత దంతకాంతులనుతీవమెఱుంగులు సుస్వరాఖ్యగ
ర్జలుగల నీ వచోమృతరసంబులు పైఁగురియంగ నా మదిం
గల భవతాపమెల్లవిడి గ్రమ్మవె యంగకదంబకంబులం
బులక నవాంకురంబులివి పొందగురీతి గదా! గదాధరా!

ఉ॥ ముద్దులుగుల్కు నీ భువనమోహనకుండలరత్నదీధితు
ల్గద్దఱిలాగుమై దళధళందొలుపారెడు భంగిఁ జూడఁగాఁ
దద్దయుఁ జెన్నుమీరెడు పదప్రణతావనకేళిలోల! నీ
నిద్దపుచెక్కుటద్దముల నిల్వక జాఱుచుఁ బ్రాకుకైవడిన్

ఉ॥ క్రొవ్విన మచ్చరించి తుదగూడక వే శరణార్థిబుద్ధితో
నివ్వటిలంగ నీ మొగమునెమ్మదిఁ జొచ్చి వెలుంగు మవ్వపుం
గ్రొవ్విరి తెల్లదామరలొకో యనఁగాఁ దగి చక్రహస్త! లే
నవ్వు దొలంకు నీదు నయనంబులు నా మదిఁ జూఱలాడెడిన్



ఉ॥ నాసికపేరి మవ్వపుటనంటికిఁ బైబొమలాకులయ్యెను
ల్లాసము చూపులేఁత మొవులాగు మెయిం దిలకంబు గన్గెడుం
బ్రాసవగంధ మింకునని బంభరడింభకపంక్తి చేరు న
ట్లై సకలేశ ! నీదు నిటలాలకజాలక మింపు గొల్పెడిన్.

చ॥ అభయవితీర్ణిధుర్య! కరుణామృతవర్షము చూపు మేఘస
న్నిభుఁడగు నీకు నీవివిధ నిర్మలరత్నకిరీట భూషణ
ప్రభలు ఘటించుచున్నయవి భక్తమయూరమహోత్సవంబుగా
నభినవపాకశాసనశరాసనసృష్టి కళాకలాపముల్

ఉ॥ ఉల్లము చల్లనయ్యె మొదలూడె మనోరథముల్ జగంబుపై
నొల్లమి పుట్టె చేరుగడ నొందితి నీ శుభదివ్యవిగ్రహో
ద్భ్యల్లసనావలోకనసుఖోదధిలోపల నోలలాడుచుం
దొల్లిటివాఁడఁ గానిగతిఁ దోయరుహేక్షణ ! సంతసించెదన్

చ॥ తెలియని ధూర్తవర్తనులు తెంపరులై తమ యుక్తిభంగులన్
బలుకుట గాక నిక్కముగ భక్తివశుండగు నిన్నుఁ జూడఁగాఁ
గలుగుటకంటె నొండొక సుఖంబును గల్గునె కల్గనిమ్ము నా
తలఁపున కింపుగా దిదియ తప్పక కల్గ ననుగ్రహింపవే!

# 4
# పింగళి సూరనార్యుడు.

ఈతడు 16వ శతాబ్దమువాఁడు. తండ్రి యమరన్న. తల్లి యబ్బమ్మ, ఇతని నివాసస్థానము కర్నూలు మండలములోని యాకువీడు, నంద్యాల మొదలగునవిగా తోచుచున్నది. నంద్యాల పరిపాలకుఁడగు కృష్ణరాజు ఆస్థానములో నుండెను. గరుడపురాణము, గిరిజాకల్యాణము, రాఘవపాండవీయము, ప్రభావతీప్రద్యుమ్నము, కళాపూర్ణోదయము లీతని కృతులు మొదటిరెండు నామమాత్రా వశిష్టములు. ఈ స్తుతిపద్యములు కళాపూర్ణోదయములోనివి.

## కళాపూర్ణోదయము

సీ॥ మణిమయప్రాకారమండపగోపురో
దీర్ణకాంతులచేతఁ దేజమునకుఁ
జారునదీహస్తచామరవీజన
వ్యాపారములచేత వాయువునకు
నారాధనార్థయాతాయాతజనవిభూ
షారజోవృష్టిచే ధారుణికిని
హృద్యచతుర్విధ వాద్యస్వనోపయో
గ ప్రవర్తనముచే గగనమునకు

గీ॥ నిజ నవాగరు ధూపజ నీరవాహ
జననసంబంధమహిమచే సలిలమునకుఁ
బావనత్వంబు గలుగంగ బరగు వేంక
టేశునగరు దాఁ జేరి యింపెసక మెసఁగ

క॥ మునుపు పరివారదేవత
లను దగ సేవించి నిర్మలప్రేమభరం
బున మేను గగురుపొడువఁగ
ననఘుఁ డతఁడు లోని కరిగి యగ్రమునందున్



సీ॥ మృదుపదాంబుజములు మెఱుగుటందెలుఁ బైడి
దుప్పటియును, మొల ముప్పిడియును,
మణిమేఖలయు, బొడ్డుమానికంబును, వైజ
యంతియు, నురమున నలరు సిరియు
వరదహస్తముఁ గటి వర్తిల్లు కేలుశం
ఖముఁ జక్రమును దాల్చు కరయుగంబుఁ
దారహారంబులుఁ జారుకంఠంబు ని
ద్దపుఁజెక్కులును నవ్వుదళుకు పసలు

గీ॥ మకరకుండలములును దామరలఁ దెగడు
కన్నులు మనోజ్ఞనాసయుఁ గలికి బొమలు
ముత్తియపునామమును రత్నమకుటవరము
నెసఁగఁ గనుపట్టు శ్రీ వేంకటేశుఁ జూచె.

వ॥ ఇట్లుజూచి.

శా॥ ప్రత్యంగంబును మిక్కిలిం దదవుగా భావించి భావించి యా
దైత్యారాతితనూవిలాసము సమస్తంబున్ విలోకించెఁ దా
నత్యంతంబును వేడ్కఁబొంగుచు నితాంతాశ్చర్యముంబొందుచున్
గృత్యం బేమియుఁ గొంత ప్రొద్దెఱుఁగ కక్షీణప్రమోదంబుతోన్.

వ॥ పదంపడి నిజానుభవం బిట్లని యుగ్గడింపం దొడంగి.

సీ॥ పదపద్మములఁజిక్కి పాయదు నా దృష్టి
కనకాంబరమునఁ కే కరణిఁ దెత్తుఁ
గనకాంబరమునఁ గీల్కొనినఁ జలింప దే
నుదరబంధమున నెట్లొనరఁ గూర్తు
నుదరబంధమున నింపొంది భేదిల్లదు
శ్రీవత్సమున కెట్లు చేరఁ దిగుతు
శ్రీవత్సమునఁ దారసిలిన రానేరదు
కేలుదామరల కే క్రియ మరల్తుఁ

గీ॥ గేలుఁదామరలను గళశ్రీల మోవి
మకరకుండలముల గండమండలముల
నాసఁ గనుఁగవ బొమలఁ గుంతలము లందు
నెందుఁ బర్విన విడఁజాల దేమి చెప్ప.

సీ॥ ఒసపరి పసమించు పసిఁడిదుప్పటివాని
శుభమైన యురముకౌస్తుభమువానిఁ
దెలిదమ్మి రేకులఁ దెగడుకన్నుల వానిఁ
గమ్మకస్తురితిలకంబువాని
తొలుఁబల్కుగిల్కు పావలఁజరించెడువానిఁ
జలువతావుల సెజ్జనలరువాని
నింద్రనీలపుడాలు నేలు వర్ణమువాని
సిరి మరుల్గొలుపు మైచెలువువాని

గీ॥ మకరకుండలదీప్తి డంబరమువాని
డంబు నెఱపెడు మణికిరీటంబువాని
రంగనాయకుఁ గాంచి సాష్టాంగనతులు
సలిపి తన్మూర్తియంతయుఁ గలయఁజూచె.

వ॥ ఇత్తెఱంగునం జూచి.

చ॥ తమి యమరంగ నొక్కొకటి దక్కఁగ నేలెడు నౌర మద్విలో
కముల మణీకిరీటమును గస్తురినామము నవ్వుమోము హా
రములును వైజయంతియు నురఃస్థలరత్నము శంఖచక్రము
ఖ్యములును బొడ్డుఁదామరయుఁ గంకణకాంచిపదాంగదాదులన్

సీ॥ దివ్యసంయమిమనస్స్థితిఁ బొల్చు మత్కుల
దైవంబుపదములఁ దలఁపుఁ జేర్తు
నఖిలలోకస్రష్ట యగు బ్రహ్మఁ గన్న మ
త్ప్రాణబంధువునాభి నాత్మఁ జేర్తు



దై తేయకంఠ నిర్దళనంబులైన నా
స్వామి హస్తముల భావంబుఁ జేర్తు
లక్ష్మిచన్గవకు నలంకార మైన నా
తండ్రివక్షమునఁ జిత్తంబుఁ జేర్తు

గీ॥ నుల్లమునకును జూడ్కికి వెల్లిగొలుపు
నా వరదుమోమునందు మనంబుఁ జేర్తు
ననుచు గీతరూపములుగా నాశుకవిత
నుతుల రచియించి పాడుచు నతఁడు గొలిచె.

## 5

# సిద్ధిరాజు తిమ్మరాజు.

ఈతఁడు 16వ శతాబ్దమువాఁడు. అళియరామరాయల మేనల్లుడు. కొండవీటిప్రభువు. తండ్రి ఓబళరాజు. తల్లి పేరెఱుఁగరాదు. ఆళ్వారాచార్యుల వర్ణనమిందలి యితి వృత్తము. ప్రౌఢమైన కవిత్వము. మంగళగిరి నృసింహస్వామి కంకితమీయబడినది. ఇతరకృతులెఱుఁగరావు.

## పరమయోగి విలాసము.

సీ॥ వినతులకొనఁగఁదాల్చిన శాంతరసమన
నడుగులఁ గటకహీరాంశు లమరఁ
గటినిడ్డ కేల్దమ్మిఁ గడు రాలి క్రమ్ము పు
ప్పొడివోలెఁ బసిఁడిపచ్చడము దనర
నార్తుల కిదియ దిక్కని తన పాదద్వ
యము చూపుగతి వరహస్తమమరఁ
గడుదయాదృష్టిఁ దెల్పెడు తటిల్లతరీతి
హృదయస్థలిని లక్ష్మి యింపు నెఱప

గీ॥ నాననేందుసుధాధార లనఁగఁ దార
హారవల్లులు నురమున నలరుచుండఁ
జారుమకుటాభిశోభియు శంఖచక్ర
హృద్యపార్శ్వుండు మా వేంకటేశ్వరుండు.

## 6

# తరిగొప్పుల మల్లన.

ఈతడు 16వ శతాబ్దముతుదిభాగమున నుండినవాఁడు. నివాసగ్రామము చంద్రగిరి. ఆఱువేలశాఖలోనివాఁడు. మధ్వమతస్థుడు. తండ్రినృసింహుడు. తల్లి తిప్పాంబ. ఈ గ్రంథము మాహురపురము నందలి దత్తాత్రేయదేవున కంకితమీయబడినది. శ్రీకృష్ణునకు సత్యభామయం దుదయించిన చంద్రభానుడు రుక్మబాహుని కూఁతురగు కుముదినిని పెండ్లియాడుట యిందలి యితివృత్తము. కవిత్వము రసవంతము.

## చంద్రభానుచరిత్రము.

సీ॥ అనశనవ్రతముచే నతులకార్శ్యంబునఁ
గనుపట్టు నోరి బీగములవారు
మ్రొక్కుఁ దీర్చుటకునై మూఁకమూఁకలు గూడి
యేతెంచు తలమోపుటిండ్లవారుఁ
బ్రాణముల్ పిడికిటఁ బట్టుక యిట్టట్టు
దెమలని శిరసుకోడములవారు
దైహికాయాసంబు దఁలపక దొర్లుచు
నడతెంచు పొరలుదండములవారు

గీ॥ నామటామట మ్రొక్కువా రడుగునడుగు
దండములవారు మిగుల సందడి యొనర్ప
నడరి పన్నగసార్వభౌమాచలేంద్రుఁ
గొలువఁ గోటానకోట్లు పెన్గూట మరుగ.

సీ॥ పైఁ బొల్చుతొలుద్రాఁచుపడఁగ యూరుపుఁ బొగ
ల్నాభిపంకజమిళిందములు గాఁగ
ఘనతటగ్రావభాగంబున కాజాను
ఘటితహస్తం బజగరము గాఁగ
మలఁచి తలాడగా నిలిపిన వలకేలి
నఖ రుచుల్మొళికుందములు గాఁగ
నోరగాఁ గుడివంక కొఱగు కౌస్తుభరుచి
శ్రీవత్సఘనతటిద్రేఖ గాఁగ

గీ॥ రాత్రిఁ బవలును జారు నేత్రద్వయంబు
పాదసంవాహనక్రియాపరవశకమ
లోరుతల కుముదాబ్జధీకారి గాఁగ
వేడ్కఁ బవళించియున్న గోవిందుఁ గొలిచి.

సీ॥ చేమాకు తాళము ల్చెలఁగ రొండులఁ జేతు
లుంచి యందఱ వెక్కిరించికొనుచుఁ
బజ్జధూపమున దీపపుఁగోల రాఁజ హ
స్తము సాఁచి జేగంట చఱచికొనుచుఁ
దల యోరగిలఁగ్రుంగి తప్పెటగతికి వా
యించి గంగెడ్ల నాడించుకొనుచుఁ
దిరువడి సానుల బెరసి గంటలు మ్రోయ
బోడచప్పరముల నాడికొనుచుఁ

గీ॥ ద్రోవఁ గూర్చుండి బొంతలు మ్రోలఁబఱచి
ముదురుటెండల కోరఁగా ముసుఁగుఁ జేర్చి
పట్టెదండలు మొఱయించి పాడుకొనుచు
నలరు దాసల్ల వీక్షించి యాక్షణమున.



సీ॥ చెక్కుల మకరికాచిత్రము ల్గరఁగఁగ
గలయ నూర్చుచు సారె నిలిచి నిలిచి
కటులభారమున వెన్కకు వీఁగి యందంద
పతులయంసము లూఁత పట్టి పట్టి
తరులనీడలు చేరనరిగి నెచ్చలి వీచు
సురటి తెమ్మెరలకుఁ జొక్కి చొక్కి
పాదాబ్జములు తొట్రుపడఁగ జానువులూఁది
యెక్కుడుదగ మెట్టు లెక్కి యెక్కి

గీ॥ వలుదగుబ్బలఁ జెమటలు వడియఁ బయట
లుబ్బనొత్తుచు నుస్సని యూర్చి యూర్చి
యలఁతఁ దూలుచు వ్రాలుచు నలఘుహర్ష
జలధిఁ దేలుచు సోలుచు జలజముఖులు.

సీ॥ ఇలఁజూపు వలచేయి వెలిదమ్మికనుదోయిఁ
జెలఁగువానిఁ, బయోధి మెలఁగువాని
దట్టిఁజేర్చినవంకి గట్టుమీఁదటిటెంకిఁ
దనరువానిఁ, బురారి నెనరువాని
నెడమపెందొడఁగేలు నెడఁజేరిచినయాలు
నెసఁగువాని, శుభంబు లొసఁగువాని
నిండుబంగరు పట్టు కొండవంచిన మెట్టు
వెలయువాని, శుకాత్మ నొలయువాని

గీ॥ చికిలి జిగిచుట్టుకత్తి జేజేలు బత్తి
నెఱపు వాని సురారులఁ బఱపువాని
వేంకటస్వామిఁ గనుఁగొని వినయ వినమి
తాంగవైఖరి మెఱయ సాష్టాంగ మెఱఁగి.

శా॥ కాలన్ముత్తెగజాలు, వేఁడిచలువల్ గ్రమ్మించుకన్దాలు, కెం
గేలం బట్టిన చుట్టువాలు, నెడచక్కిం గల్మిప్రోయాలు, నే
వేళన్ భక్తుల బ్రోచు మేలు, తెలిదీవిం బొల్చు పెన్రోలు, ని
ర్మేలం బాయని వేల్పుచాలు, గల సామిన్ వెన్నునిం గొల్చెదన్.

శా॥ ఆర్తత్రాణపరాయణాయ భువనైకాధారభూతాయ సం
వర్తాంభోనిధిమగ్నభూభరణకృద్వారాహరూపాయ దో
ర్వార్తాభీతమహీసుతాయ శిశుతావ్యాపారనశ్యత్తృణా
వర్తక్రూరనిశాచరాయ దివిషద్వంద్యాయ తుభ్యం నమః

సీ॥ రేరిక్కరాఱాల నూరిన నీ రేఱు
లై తూఱ నీరికలైన చోటఁ
గ్రేళ్లుబ్బి సెలలు దాఁకిన నుర్లునెత్తాల
నలరు కానలఁ దారు తలిరుఁ గత్తి
ఈని బాబాలేఁతఈక్క సోఁకులసారెఁ
దలఁకు నీరంబుల నొలుకు తెలిసి
రంబుతోఁ దనర నొరలు కన్నెక్రొన్నన
తేనె సోనల నసలైన నేలఁ

గీ॥ దొలఁకు కొలఁకు కెలఁకులఁ దళుకు గులుకు
నున్న తిన్నెలఁ దరలక నూలుకొనిన
కిన్నెర కలకలంబుల కేకికరుతు
లూనుచుండెడు తుంబురుకోన డాసి.

# 7
# చెళ్లపిళ్ల నరసకవి.

ఈకవి 18వ శతాబ్దపుతుదినుండి 19వ శతాబ్దపు తొలిభాగము వరకు వర్తిల్లినవాఁడు. తండ్రి చెళ్లపిళ్లకామయ. తల్లి వెంకమాంబ. స్వగ్రామము గోదావరి జిల్లాలోని కడియము. యామినీ పూర్ణతిలకా విలాసము. వేంకటేశ్వర విలాసము, ఏకప్రాసకంద గోపాలశతకము, అహల్యా సంక్రందన విలాసము, ఏకాంతసేవాకలాపము వీరి కృతులు. ఈ స్తుతిపద్యములు వేంకటేశ్వరవిలాసములోనివి. శ్రీ వేంకటేశ్వరుఁడు చెంచుకన్నెం బెండ్లియాడుట యిందలి యితివృత్తము.

## వేంకటేశ్వరవిలాసము.

సీ॥ వలరాజుగాన్పు, చిల్వలరాజుపాన్పు, గ
ల్వలరాజులొన్పుగా, గలుగువాఁడు
కడలేని కల్మి, యెక్కడలేని బల్మి, ని
ల్కడబోని చెల్మి, సంగరమువాఁడు
కరివన్నెచాయ, విన్కరిఁగన్నమాయ, తొ
ల్కరిఁగన్నుమూయ, నెచ్చరికె వాఁడు
కరమున్నరూపు, సత్కరమున్న చూపు, మొ
క్కరమున్నబాపు, చిక్కెఱుగువాఁడు

గీ॥ మేలువాఁడు, జగజ్జాల మేలువాఁడు
నోమువాఁడు, వరంబిచ్చు నోమువాఁడు
వన్నెవాఁడు, దలంప మువ్వన్నెవాఁడు
యీశ్వరుండగు శ్రీ వేంకటేశ్వరుండు.

సీ॥ సిగను బించెమువాఁడు, తొగలసంగడికాని
వగలఁగుల్కెడు ముద్దుమొగమువాఁడు
మొలక నవ్వులవాఁడు, కళుకుబంగరువన్నె
తళుకు దువ్వలువ మైఁగులుకువాఁడు
కొమరుప్రాయమువాఁడు, గుమురు నీలపురాల
కొమరునెమ్మెయిచాయ లమరువాఁడు
నెనరుఁజూపులవాఁడు, వనరుహాలయకిమ్ము
దనరు పేరెదఁబేరు లొనరువాఁడు

గీ॥ నొసటఁ గస్తురినామంబు పొసఁగువాఁడు
కరములను శంఖచక్రముల్ గలుగువాఁడు
డంబుమీఱిన మణికిరీటంబువాఁడు
మేలు శ్రీవేంకటాచల మేలువాఁడు.

సీ॥ తనుఁగొల్చువారిచేతను లంచముల వడ్డి
సాధించుఁ గాసు వీసంబులనక
పేదచందమునఁ జేబియ్యంపుటోరెంబు
పులివోని పళ్లెరంబుల భుజించుఁ
బిల్వనెచ్చుట నైనఁ బేర్మివిందులు సేయుఁ
దనయింట నెపుడు నందఱు మెసంగ
వేడ్కఁ బ్రసాదంబు విల్వఁ జేయ నొనర్చి
కరమొసంగును గుత్తకాని రీతి

గీ॥ ననుచు నీ జాడ లెన్నుదు రట్టి నీవు
పంతమున నన్నుఁ బైకొనుటెంత మాట
దురితసంహార శేషభూధరవిహార!
పంకజాతాప్తనీకాశ ! వేంకటేశ !



సీ॥ సేవకద్రవ్యమార్జింపుట భక్తమా
నసలోభమణఁచుట నయము గాదె
ముడివంటకంబుఁ జిల్కుమిడిపళ్లెరంబులఁ
దినుట నీ గర్వత్వ మనువు గాదె
అందఱి యిండ్లలో నారగింపుటలట్ల
తినఁ జేయుటలు సమదృష్టి గాదె
బలువంటకము విల్వఁబఱచి పన్నిచ్చుట
గణుతింప నది ధర్మగుణము గాదె

గీ॥ నెలత! యివి దోషములుగావు నింద సేయ
నమిత, సుగుణానుగుణ, విశేషములుకాని
భావగుణధాత్రి! కుతుకసంపత్ప్రదాత్రి!!
చంద్రనిభగాత్రి! భిల్లరాజేంద్రపుత్రి !!

# 8
# కాకమాని మూర్తికవి.

ఈతడు 16వ శతాబ్దమువాఁడు. తండ్రి రామలింగభట్టు. తల్లి తిమ్మాంబిక. స్వగ్రామము కాకమాను. రాజవాహనవిజయము. పాంచాలీపరిణయము, బహుళాశ్వచరిత్రములీతని కృతులు. ఈస్తుతిపద్యములు రాజవాహనవిజయములోనివి. మగధదేశమందలి కుసుమపురమును పాలించు రాజహంసుని కుమారుడగు రాజవాహనుడు మానసారమహీపాలుని కుమారుడగు దర్పసారుని యుద్ధమున జయించి మానసారమహీపాలుని కుమార్తెయగు అవంతిసుందరిని పెండ్లియాడుట యిందలి యితివృత్తము. ఈ గ్రంథము శ్రీవేంకటేశ్వరస్వామి కంకితమీయబడినది.

## రాజవాహన విజయము.

ఉ॥ శ్రీయధరోపరింగుచగిరిం గబరిం దరహాసవీటికా
చ్ఛాయల యింపుసొంపులయి చందనకుంకుమపత్ర రేఖలై
యాయతకుందచంపకములై తగఁగన్గొను వేంకటేశ్వరుం
డా యిరుగంటిచూడ్కి భజనార్థితమమ్ము నదల్చు గావుతన్.

సీ॥ ఇందిరామదిరాక్షి కీడాపు నీలంపు
మేడచుట్టు ప్రహరి గోడ యనఁగఁ
దన చేతి కెల్లప్పుడును లోనుగా రమా
తరుణి వైచిన వలత్రా డనంగ
నలమేలుమంగ సయ్యాటంబునకు వైవఁ
దాల్చిన పొగడపూదండ యనఁగ
మున్నీటి కన్నెయన్ పెన్నిధానంబు దూ
గుటకు వైచిన యట్టి గొలుసనంగ



గీ॥ భరితకౌస్తుభ దినమణిపరిధి యనఁగఁ
దనుఘనాశ్రిత మఘవకోదండ మనఁగ
వేంకటాధీశు నురముపై వినుతిఁ గనిన
వైజయంతిక మాకిచ్చు వైభవములు.

సీ॥ తన తనూరుచిపైనిఁ దగ నుల్లసిలు గుల్ల
కావినాఁ గనకాంశుకంబు దనరఁ
గరముల శంఖచక్రంబులు భుజముల
వ్రాలిన హంసచక్రములఁ దెలుప
మును మ్రింగిన దవాగ్నినన వచ్చెనా నురోం
గణమునఁ గౌస్తుభమణి వెలుంగ
నలిక పత్రాంత్యద్వయ లిఖితశ్రీల క్రిం
దటి పూలన శ్రుతికుండలము లమరఁ

గీ॥ జల్లచూపుల కాంతామతల్లి నాదు
తల్లి యలమేలుమంగ కైదండఁ గొనుచు
బన్నగనగాధ్యుఁ డేనింత కన్ను మోడ్చు
తరినిఁ గలలోన నెదుటఁ బ్రత్యక్షమయ్యె.

సీ॥ ఏ దేవు కనుదోయి హిమధామసోదరీ
కుటికాకవాటంబు కుంచెకోల
యే దేవు చరణాబ్జ మిందిరాపుత్రికా
కాకోదరాంగద కూకుదంబు
ఏ దేవు చేకత్తి ఋభురాజపౌత్రుభా
త్రుకుఁ జల్లచేతుల మంత్రసాని
యే దేవు నాభి పూవిగురు జేజేబువ్వ
క్రొవ్వెదఁగలయయ్య కవ్వగారు

గీ॥ సేవ కే దేవుఁడొందె నర్చావతార
మట్టి శ్రీవేంకటాచలాధ్యక్షునకును
బరమమూర్తికి మామకభవ్యకావ్య
కన్యకల్యాణమొనరింతు గౌరవమున.

ఉ॥ చెప్పిన పద్యమెల్లఁ జెవిఁజేర్చి వినున్వినడొంకు గల్గినం
దప్పులు గిప్పులెన్నఁడొకనాఁడును నాఁడును నేఁడు వేడుచో
నప్పన నెట్టిపోడఁడిగినన్ని వరాలిడుఁ గొండమీఁది తి
మ్మప్పని వంటి కావ్యపతి యబ్బుట యబ్బుర మిబ్బుధాళికిన్

చ॥ పలికిన పల్కులెల్లఁ బరిపాకము దప్పఁగ ఖండశర్కరల్
ఫలములు జున్నులుక్కెరలు పక్వములింక మనోహరంబు లే
దలఁచిన పద్యమంతయు సుధారసమౌనఁట వేంకటాద్రి రా
ణ్నిలయుని కింకిటం గృతి ఘటింపక మానుట మాకు నేటికిన్

సీ॥ శ్రీఖండ నగ పటీరాఖండసౌరభ
వ్రజదాయి యే గట్టు వంటచెఱకు
నాసత్య సుఖవర్తనాసత్య భైషజ్య
జీవాతు వే గట్టు చేదుచెట్టు
రమణీయతర శచీరమణీ రమణమణి
కుట్టాక మే గట్టు చట్టుఱాయి
ధూర్జటి స్ఫుటజటాంతర్జటీవాటి సిం
ధుస్పర్ధి యే గట్టు దొనలనీరు.

గీ॥ వ్యాసవాల్మీక శాండిల్యవాలఖిల్య
దేశికుల కెల్ల మంత్రోపదేశకర్త
లరయ నే శైలమున నుంకు లనగ దనరు
నట్టి వేంకటగిరి కొనియాడ దగదె.



ఉ॥ సంకలితాంబుతామరససానుగభీరకుమారదారికా
భ్రంకష నిష్కళంక ఝరపాపవినాశన తీర్థసేవనా
ధ్యంకరణాత్మభూభువన,యౌవత, కల్పరసాల కేళిడో
లాంకట, సద్విశంకటతరైలము, వేంకటశైలమొప్పగున్.

సీ॥ ఏ చెట్టు చూచిన హితగంధచందనం
బే రాలు గనుఁగొన్న నింద్రమణులె
యే జంతు వీక్షింప మృగనాభి మృగరాజ
మేదొనఁ గన్న గంగోదకంబె
యే తీర్థ మరసిన వృజినద్రుమకుఠార
మేచఱియను గన హీరమయమె
యే మండపముఁజూడ వామాచలోపమం
బే ఋషి దర్శింప భృగునిభుండె

గీ॥ భోగములకండ, యలవేల్పు బువ్వదండ
పతితులకు బొండ, పేదలపైఁడికుండ
తమమురేయెండ, విబుధామృతంపుటుండ
కొండమాత్రంబె తిమ్మప్పఁ డుండు కొండ.

సీ॥ తన పైడిగోపురం బనుదిన సేవార్థి
గడికి సుమేరు శంకాప్రదంబు
తన బలిపీఠ మార్ద్రదుకూల పతితాంధ
బధిర వంధ్యా పంగు పరివృతంబు
తన మహానసము నూతనఘృతాత్తాలంబ
సౌరభ్యవాసితాశావలయము
తన గర్భగృహము చందనచంద్రసాంకవ
కుంకుమమృగనాభి పంకిలంబు

గీ॥ గాన నే దేవళంబు వేంకటనగమున
వెలయఁ గనుపట్టునట్టి కోవెల వసించు
దేవుఁ డలమేలుమంగామనోవిభుండు
దొలcచు జన్మాంతరానంత దుష్కృతములు.

క॥ అప్పప్ప చూడవలదా
యప్పని కోవెలపటీర హైమజలంబుల్
కప్పురము పునుcగు మృగమద
మెప్పట్టున తావిగల్లు భృగుదివసమునన్

సీ॥ జన్మజన్మార్జితచటుల పంకంబు గో
రాడcడే వృషభాచలాగ్రవాసి
పక్షంబున దరిద్రభావాహి ద్రుంపcడే
గరుడవసుంధరాధరవిహారి
యౌషధాసాధ్య వాతాదిరోగంబులc
దూలింపcడే శేషశైలభర్త
భూతాది శంకానిరాతంక గహనంబు
హరియింపcడే వేంకటాద్రినాథుc

గీ॥ డమృతనిధిc జూపcడే యంజనాగవిభుcడు
భద్రమూర్తి యమృతహారి భవ్యకీర్తి
చక్రి శుచినామధేయుండు జడమరీచి
కంకణముcగట్టినాcడు రక్షణముకొఱకు.

సీ॥ అఱుగునో యనక కట్టాని యొంట్లడియెcగాc
జేరెcడు బియ్యాలజియ్య చెలియ
సమయునో యనక కాంచనశాటిcగట్టెcగాc
దోమని పళ్లేలదొర లతాంగి



ధనమెంత దఱుగునోయనc డింత వెచ్చమా
వడ్డికాసుల వెరవడికిcగలికి
కానుకసొమ్ములోcగల డన్నిcట శిఖలో
యామటామటమ్రొక్కులయ్యయబల

గీ॥ యనుచు నగి మ్రొక్కుదురు వేంకటాధినాథు
నక్కడికి నల్లుహరిదమ యన్నుమగని
చక్రికుధరోత్తమమునడుచక్కి కెక్కి
చక్క ముక్కోటి కరుదెంచు సౌరసతులు

సీ॥ ప్రజలcగాననివాని పాయసంబను సుద్ది
తునుమవా దృష్టి యంధునకు నిచ్చి
గొడ్రాలెఱుంగునే బిడ్డకుట్టనుట మా
న్పింపవా వంధ్యకు నిసువొసంగి
తూలింపవా యెద్దుcద్రోచిన పిచ్చుగుం
టను పల్కు పరువు పంగునకు నొసcగి
పాపవా చెవిcటికిcబట్టిన సంకను
నానుడి బధిరువినంగc జేసి

గీ॥ యనుచుcజను వేంకటాచలాధ్యక్షు జలరు
హాక్షు లక్ష్మీవిశుద్ధశుద్ధాంతవక్షు
బ్రహ్మతిరునాళ్ల కరుదెంచి ఫలముcగాంచి
కటక కళ్యాణ ఢిల్లీ నికటజనంబు

సీ॥ ఎటువంటిదో చూడ మెట మంచిగంధంబు
జిడ్డంచుc గౌcగిట జేర్చి చేర్చి
కనమెన్నcడిదిగదా యనుచుc గన్నులc గది
యcగ బారిజాతంబు నత్తి యత్తి

తలcపుకెం పిటువంటిదా యంచుc దుఋమునc
గొన జుట్టునను మేనcగూర్చి కూర్చి
వినువాcక యిదిగదా యనుచు నాకాశగం
గావారి నంగముల్ గడిగి కడిగి

గీ॥ శేషగిరిc జేరి యారామసీమc గోరి
శైత్యకృత్యంబు నిత్యంబు సల్పు వేంక
టేశ వైశాఖతీర్థనిరీక్ష కరుగు
దెంచు నాసేతుకాశితైర్థిక జనంబు

సీ॥ కొడుకు మన్మథుc డాcడుcబడుచు భాగీరథి,
యిల్లాలు భూకాంత, యిల్లు కొండ,
యన్న దా బలభద్రుcడగ్రసూనుcడు బ్రహ్మ,
కోడలు శారద కొలములోన,
మఱంది కల్వలఱేcడు, మామ సముద్రుండు,
మఱియును రెండవమామ భోజుc
డలరు పేరెదసొమ్ము వెలలేని మాణిక్య
మచ్చబంగారు పైపచ్చడంబు

గీ॥ నన్న వెచ్చంబు ముక్కంటి కెన్న నరిది
జగము లీరేడు గర్భవాసమున నిముడు
సిరియొడయcడెంత సంసారి శేషశైల
వల్లభునివంటి దాత దైవంబు గలcడె.

# 9
# రేవణూరి వెంకటాచార్యులు.

ఈతcడు 17వ శతాబ్దము తుదినుండబోలు. తండ్రి తిరుమలకొండయార్యుcడు. తల్లిపేరెఱుcగరాదు. జన్మస్థానముగాని నివాసస్థానముగాని యెఱుcగరాదు. రామచంద్రోపాఖ్యానము, శకుంతలా పరిణయము, శ్రీపాదరేణు మాహాత్మ్యములీతనికృతులు. రామచంద్రోపాఖ్యానము లభ్యమగుటలేదు. ఈస్తుతి పద్యములు శ్రీపాదరేణు మాహాత్మ్యములోనివి. శ్రీ వేంకటేశ్వరుని శ్రీపాదరేణుమాహాత్మ్య మిందలి యితివృత్తము.

## శ్రీపాదరేణుమాహాత్మ్యము

సీ॥ ఇంపైన కొవ్వాcడి సంపెంగ నెత్తావి
నింపు జవ్వనిమేని సొంపు తావి
పాటలీకుసుమంబు సూటిగంధపుc జల్వ
బోటి మైగంధంపుమేటి చల్వ
కల్వ కొవ్విరి మంచి విల్వవాసన గొల్వc
జెల్వదేహపు మంచి చల్వ వలపు
నెమ్మి బంగరు తమ్మి దొమ్మి గ్రందు దువాళి
కొమ్మ యంగము గమ్ముకొను దువాళి.

గీ॥ సమ్మదానందమును బొందు సన్మునీంద్ర
యెమ్మెలాడి తనూసౌరభమ్ము సాటి
కమ్మవిరు లన్నిటికి సౌరభమ్ము లొసcగు
సుమ్ము హరిపాదరేణులేశమ్ము మదన.

సీ॥ కాలాగరుజధూపగత వాసనలకన్న
పాటీరతరు సౌరభములకన్న
పారిజాతగుళుచ్ఛ పరిమళంబులకన్న
పంకజాతామోదపటిమకన్న
కర్పూరపంకసంకలిత గంధముకన్న
కస్తూరికాస్వాదు కలనకన్న
వకుళప్రసూనజీవనపు తావులకన్న
సాంకవప్రకటితాసవముకన్న

గీ॥ నధికతరమై ఘుమంఘుమాయతన మగుచు
మధురతరమైన శేషాద్రిమందిరాత్మ
పాదరేణువు నా జిహ్వపై వసించి
సుకవితారీతివలపులఁ జొనుపుఁగాత.

ఉ॥ ఎంతటిరోగమైన హరియింతు నిమేషములోన నంచు ధ
న్వంతరిరూపమైన నెఱవైద్యుఁడు వేంకటనాథుఁడట్టి శ్రీ
మంతుని పాదరేణు పరమౌషధమౌచు మదీయరోగ మా
ద్యంతముగా నడంచియుఁ జిరాయు వొసంగును నాకు నీయెడన్.

సీ॥ పైత్యభ్రమధ్వాంతపటలభానూదయం
బతి మేహదావానలాభ్రవృష్టి
కఫరోగబుర్బురత్కర్దమగ్రీష్మంబు
పాండు దుష్టోరగ పక్షిరాజు
పటుపురాణజ్వరపర్వతదంభోళి
క్షయకాలకూటవిషత్రిశూలి
కుత్సితశ్లేష్మాబ్ధికుంభసంభవమూర్తి
ధాతుప్రసూనచైత్రక దినంబు



గీ॥ వాతజీమూతసంఘాతవాయుపథము
చిరతరాయురభారసంజీవకరణి
వేంకటేశ్వర శ్రీపాదపంకజాత
రేణువు మదీయరుజలు హరించుగాత

ఉ॥ నందుని సుందరీమణియనం దగునట్టి యశోద తల్లి యై
పొందుగ పాలు వోయుచును బుద్ధులు చెప్పుచు ముద్దులాడుచో
నందమదై యహీంద్రగిరినాథుఁడు నాబిడచిన్ని బొజ్జపైఁ
జిందులు దొప్పు నుబ్బులకుఁ జెందిన రేణువు నాశ్రయించెదన్

మ॥ అలఘుస్వచ్ఛములై, యభీష్టదములై, యత్యంతసాంద్రంబులై,
విలసద్ద్రవ్యములై, విలక్షణములై, విశ్వప్రచారంబులై,
లలితామోదములై, లతాంతగతులై, లాస్యాధితత్త్వంబులై,
చెలువందెన్ ఫణిరాజశైలనిలయ శ్రీపాదభూరేణువుల్

సీ॥ కలువ పూరేణువు కపురంపు రేణువు
సరిసేయఁ దగ దని చాట వచ్చు
గంధంపురేణువు కస్తూరిరేణువు
ప్రతిచెప్పరాదని పలుకవచ్చు
పునుఁగు రేణువుమంచి పొందమ్మిరేణువు
పురుడుగాదని చాలఁబొగడవచ్చు
సంపంగిరేణువు జాజిపూ రేణువు
దీపౌనె యనుచు వాదింపవచ్చు

గీ॥ ఘనతరస్వచ్ఛతామోదగరిమ మాత్ర
మున వహింపగ జగమెల్ల ముంచి తేల్చు
పరిమళములీను శేషాద్రిభవనుడైన
శ్రీనివాసుని శ్రీపాదరేణువునకు.

గీ॥ గౌతమాంగనవలె ఱాయిగాను నడవి
లోన బడియుండగానైతి నేను జగతి
శ్రీరఘూత్తముడై నట్టి శేషశైల
నాథునంఘ్రిరజఃస్పర్శ నాకు గల్గు

సీ॥ చతురాననస్ఫూర్తి బ్రతుకు బ్రహ్మకునైన
సర్వజ్ఞుఁడగు గిరీశ్వరునకైన
వాచస్పతిత్వంబు వరలు గీష్పతికైన
శక్తిదాల్చు కొమరసామికైన
ధర ననంతఖ్యాతి మెరయు శేషునకైన
షడభిజ్ఞుఁడగు గణేశ్వరునకైన
వాగ్దేవతాసార్థవతి సరస్వతికైన
విబుధాఖ్యమగు దైవవితతికైన

గీ॥ సకలపాపక్షయంబుల సకలరోగ
హరణమై సర్వశుభదాయియై దనర్చు
వేంకటేశ్వర శ్రీపాదపంకజాత
రేణులేశంబు మహిమ వర్ణింపఁదరమె.

సీ॥ ప్రణుతిఁ జేసెడివేళ బహు దివ్యరత్న సం
ఘటితకోటీర భాగములమీఁద
పూజఁ జేసెడి వేళ పున్నాగమల్లికా
పారిజాతాది పుష్పములమీఁద
పాద్యమిచ్చెడి వేళ పంకజాతామోద
పుష్కరనిమ్నగాంబువులమీఁద
పదములొత్తెడి వేళ పరమరేఖాచక్ర
సౌభాగ్యమృదుల హస్తములమీఁద



గీ॥ నెలమిఁ బ్రసరించి బ్రహ్మరుద్రేంద్రముఖ్య
దేవగణముల కోర్కులు దీర్చునట్టి
వేంకటేశ్వరు శ్రీపాదపంకజాత
దివ్య రేణువు మా కోర్కె దీర్చుఁగాత.

సీ॥ కలమృగంబులవెల్ల కస్తూరిమృగములై
పొలుపొందె వేంకటభూధరమున
పసిఁడిరేకులవెల్ల పద్మంపురేకులై
పొలుపొందె వేంకటభూధరమున
నయము సరసులెల్ల నవసుధాసరసులై
పొలుపొందె వేంకటభూధరమున
జనితసత్తరు లెల్ల చందనతరువులై
పొలుపొందె వేంకటభూధరమున

గీ॥ ధూళులెల్లను కర్పూరధూళులగుచు
బోల్పపొలుపొందె వేంకటభూధరమున
శ్రీనివాసాంఘ్రిరేణువై చిత్రకలిత
పరిమళఘుమంఘుమద్గుణప్రాప్తమహిమ

ఉ॥ నాకమునందు గల్గు సుమనంబుల తావుల మించి నేడుయీ
యాకసమేమొ తత్పరిమళాయత మయ్యె సురేంద్రరంభనన్
వేకువఁ**దాళ్లపాక తిరువెంగళనాథుఁడు** బాడనాడు ద
ర్వీకరరాడ్గిరీశపదరేణువు లెల్లను కప్పబోల్ జుమీ.

మ॥ తిరుమంత్రాఖ్యహలంబు పూని కృషికర్థీమంతు డాత్మీయహృ
ద్ధరణిన్ దున్ని ద్వయార్థబీజములు నిండంజల్లు నంకూరమై
పరగన్ బూచిన మోక్షశాలికిని పైపై సత్తువల్ నింపు దా
నెరువై శేషగిరీంద్రపాదరజమూహింపంగ నిద్ధారుణిన్.

సీ॥ సకలబాడబగేహసమితి కాహవనీయ
సద్ద్రవ్యధూపధూసరము లగుచు
సర్వమౌర్వీధనుక్షత్రియశుద్ధాంత
సౌధంబులకు పుష్పశరము లగుచు
నఖిలనర్తకపణ్యముఖపద్మముల కైన
మదసంకుమదచంద్రపదము లగుచు
నఖిల మహాశూద్ర నిలయంబులకు తప్త
గోక్షీరనవనీతఘటిక లగుచు

గీ॥ సంచితసమస్తఘటహస్తి శాలలకును
భూరివిస్తారపరమదధార లగుచు
బరగె శ్రీవెంకటస్వామి పాదరేణు
పరిమళంబులు తిరుమలపట్టణమున.

సీ॥ నే కటాక్షించితేనే కదా మూకకు
మూకత్వము దొలంగు లోకనాథ
నే దయాధృతిగన్న మీదకా బధిరుని
బధిరత్వము దొలంగు విధిపదాంక
నేను సంభాషించితేనె కా యజ్ఞాను
నజ్ఞానము దొలంగు విజ్ఞహృదయ
ధాత్రి నాదుప్రసాద మత్తికా నత్తికీ
నత్తిపల్కు దొలంగు నలినగర్భ

గీ॥ మూకకును మూకత దొలంగు, మొగి బధిరుని
బధిరత దొలఁగు, నజ్ఞు నజ్ఞత దొలంగు,
నత్తికిని నత్తి దొలఁగు, శ్రీనారసింహు
పదరజఃస్పర్శమాత్రనే పలుకుబోటి.



శ్రీలలనకరంపుఁజెమరురేణువును
గోలల నపయంటకొమరురేణువును
నీళ చన్నులపైన నెలయురేణువును
నోలిమై యహితల్ప మొరయురేణువును
విమలాదులకుఁ దావివీగు రేణువును
విమలాప్సరలబాడువేగు రేణువును
నిత్యముక్తులమేన నిండు రేణువును
ప్రత్యమరులపుండ్ర పాండురేణువును
నమరంగ జయముఖ్యు లరయు రేణువును
కుముదాదులకు గోర్కి గురియు రేణువును
ననిరుద్ధసంకర్షు లానురేణువును
నొనరఁబ్రద్యుమ్నాదు లూనురేణువును
బహురుద్రవిధిశక్రభావ్య రేణువును
బహులోకపాల సద్భవ్యరేణువును
నమరులరణ్యంబు లరయు రేణువును
విరజపైపైఁ దేలివెలియురేణువును
నలసోమసవనంబు నాపు రేణువును
వలగి ముక్తుల శ్రమల్ వాపు రేణువును
పరమపదంబెల్లఁ బరచు రేణువును
పరమవైష్ణవులమేల్ పరచు రేణువును
గంగాప్రసూస్నానకలిత రేణువును
గంగోర్మికలలోనఁ గలచు రేణువును
ఘనసింధుమార్గంబు గప్పు రేణువును
మునులమృగాదులమోద్పు రేణువును
సత్యలోకపుగొండ్లి సలుపు రేణువును
నిత్యసంసర్గంబు నిలుపు రేణువును

క్షీరాబ్ధినురుగులం జెందురేణువును
భూరివైకుంఠముల్ పొందురేణువును
చంద్రసూర్యులలోని సంచురేణువును
నింద్రాదిసురలు మోహించు రేణువును
మీనుచెక్కులపైనమృదువు రేణువును
పూని కూర్మముగాచు పొదువురేణువును
ఘోరకోలము కోలకొనలరేణువును
నారసింహుని గోళ్లననల రేణువును
గుజ్జువామనుకుంభ గుంభ రేణువును
రజ్జుపారునుకళారంభ రేణువును
రాతినాతిని జేయురాపురేణువును
రీతినీలపుటంశ రేపురేణువును
కపటలప్పవిపాదిగట్టిరేణువును
నెపమగుజ్జుపుచొంగనెట్టి రేణువును
నందసుందరిబొజ్జ నాటురేణువును
క్రిందువేతలకళల్ గీటురేణువును
బూతనచనుచేదు పుచ్చురేణువును
వాతరూపునినేలవ్రచ్చు రేణువును
శకటారి దెగటార్చి జడియురేణువును
ప్రకటాళినొకడోళిబడియు రేణువును
కాళీయుతలలపై గదలు రేణువును
మేలీయదలకొల్ప మెదలురేణువును
యమునతో యమ్ముదాయమ్మురేణువును
ఘుమనవాసిలుతావిక్రోవిరేణువును
మద్దులుదిగనీడ్చి మసుకురేణువును
ముద్దువిద్దెములాడుముసుకు రేణువును



జట్టిపోరులదొమ్మిజమ్మురేణువును
గుట్టవైరులదిమ్ముగ్రుమ్ము రేణువును
ద్వారకాగరుధూపదర్పరేణువును
సారసశక్తిప్రసర్పరేణువును
రైవతకుంజాభిరామరేణువును
దైవతావలిపరంధామరేణువును
రాధికాకేళీనిరాసరేణువును
మాధవీగంధాదిమాస రేణువును
రుక్మిణీనిటలసారోపరేణువును
రుక్మాంగదాక్షిచిద్రూపరేణువును
సత్యభామాతపస్సార రేణువును
సాత్యకీహస్తప్రసాద రేణువును
మిత్రవిందాగంధమిళితరేణువును
మైత్రేయముఖపరీమళిత రేణువును
జాంబవత్యక్షిప్రశస్త రేణువును
జాంబవంతకశిరఃప్రస్థరేణువును
కాళిందికాసరఃకమల రేణువును
కాళిందజానదీకమల రేణువును
లక్షణాకబరికాలసిత రేణువును
లక్షణప్రదమహాలలిత రేణువును
భద్రాకపోలసంబంధ రేణువును
భద్రయోగసదనుబంధ రేణువును
మహితసదంతసీమంత రేణువును
సహితోద్భవాదికస్వాంత రేణువును
యాదవావళిగోరినట్టి రేణువును
యాదవప్రభుపీఠహారి రేణువును

శ్రీశైలభోగప్రసిద్ధరేణువును
శ్రీజానకీ ముఖ్యసిద్ధ రేణువును
స్వామిసరఃకేళిసౌఖ్యరేణువును
స్వామిపూజాముఖ్యసఖ్యరేణువును
నాకాశగంగాజలార్ద్ర రేణువును
నాకాశరాజపోషార్ద్ర రేణువును
తొండమాధిపసముద్ధూత రేణువును
పాండవతీర్థసంపాద రేణువును
సంకీర్తనాచార్యసఫల రేణువును
వేంకటాహ్వాయపద్మవిమల రేణువును
నలమేలుమంగాధిపాంఘ్రి రేణువును
దలఁతు మమ్ములఁబ్రోవదలఁచు రేణువును.

# 10
# తాళ్లపాక అన్నమాచార్యుఁడు

ఈతఁడు 15వ శతాబ్దమువాఁడు. తండ్రి నారాయణసూరి. తల్లి లక్కాంబ. జన్మస్థానము రాజంపేట తాలూకాలోని తాళ్లపాక. ఈకవి సాళువ నరసింహదేవరాయల కాలములో నున్నవాఁడు. ఆంధ్ర ద్రవిడ కర్ణాటకభాషలలో సంకీర్తనపద్ధతి కీతఁడే సృష్టికర్త. సరససంగీత విలాసములతో సర్వజనసులభముగా, సంకీర్తనాత్మకముగా నాంధ్రవేదాంతము నవతరింపజేసినాఁడు. ఈతనికి సంకీర్తనాచార్యుఁడని, హరికీర్తనాచార్యుఁడని, పదకవితాపితామహుడని, ఆంధ్రవేదాంతకర్త యని బిరుదులుగలవు. ఆధ్యాత్మసంకీర్తనలు, శృంగారసంకీర్తనలు, వేంకటేశ్వరశతకము, శృంగారమంజర్యాదులు లభించినవి. సంకీర్తనలక్షణము ( సంస్కృతము) శ్రీవేంకటాచలమాహాత్మ్యము, రామాయణము మొదలైన గ్రంథములు రచించినట్లు యీతని మనుమడు చెప్పెను. కాని, పైగ్రంథములు కానవచ్చుటలేదు.

## శ్రీవేంకటేశ్వర శతకము.

ఉ॥ పల్లవపాణి విశ్వగురుభామిని యిట్టి ప్రపంచ మంతకున్
దల్లి సమస్తజీవులనిదానమ శ్రీయలమేలుమంగ! నీ
చల్లనిచూపు చిల్కి వెదచల్లఁగఁ బుణ్యులమైతి మంద్రు భూ
మెల్లనను నీ వధూమణి ననేకవిధంబుల వెంకటేశ్వరా!

చ॥ వెలయఁగ వేంకటాచలమువీథులఁ గమ్మని పుష్పవృష్టి కిం
పలరఁగ నేఁగివచ్చి యలపారఁగ నయ్యలమేలుమంగతో
నలరఁగ గోరకమ్ముల లతాంగన లిమ్ముల సేస చల్లఁగాఁ
గలకలనవ్వు మిమ్ముఁ గలకంఠశుకావళి వేంకటేశ్వరా!

చ॥ చాఁగుబళా జగత్పతికిఁ జాఁగు బళా జగదేకమాతకున్
చాఁగుబళా రమేశునకుఁ జాఁగుబళా యలమేలుమంగకున్
జాఁగుబళా యటంచుఁ గడుఁజక్కని కాంతను వీథికీథి మీ
రేఁగఁగనిత్తు రారతు లనేకవిధంబుల వేంకటేశ్వరా!

చ॥ పరిమళముం బ్రభావము శుభస్థితి నిత్యవిభూతి విభ్రమ
స్ఫురణము దివ్యవైభవము భోగము శ్రీయలమేలుమంగ నీ
యురమున నంచు సన్మునులు యోగిజనంబులు మెచ్చిమెచ్చి నీ
వరవనితాశిరోమణి నవారణఁ గొల్తురు వెంకటేశ్వరా!

ఉ॥ ఒక్కొకనాఁటిరాత్రి సకలోన్నతుఁడైన ఖగేంద్రమూర్తిపై
నెక్కి వినోదలీలఁ జరియించుచు నయ్యలమేలుమంగ మో
మక్కునఁ జేర్చుచున్ బహువిహారములన్ వనవీథులం బ్రియం
బెక్కువగాఁ జెలంగు విధమేమని చెప్పుదు వేంకటేశ్వరా!

ఉ॥ ఓ చెలి! యో లతాప్రతిమ! యో మృగలోచన! యో చకోరికా!
యో చదురాల! యో చిలుక! యో సతి! యో యలమేలుమంగ నీ
చూచిన చూపులే విభుఁడు చూచినచూపు లటంచు నీసతిన్
ఖేచరసిద్ధకామినులు కీర్తన సేతురు వేంకటేశ్వరా!

చ॥ పరిమళమో కదంబమో ప్రభల్విడ నించిన నిగ్గొ నిర్మలా
భరణమొ నిత్యవైభవమొ భాగ్యమొ శ్రీయలమేలుమంగ భూ
ధరునకు నాదిలక్ష్మియని తత్త్వమహత్త్వరహస్యవేత్త లం
బరమున నుండి నీవనితఁ బ్రస్తుతి సేతురు వేంకటేశ్వరా!

ఉ॥ కొమ్మకు గోరుముద్దలును గుజ్జెనగూళ్లను బేడపొళ్లు మా
యమ్మకు, బొమ్మరిళ్లు లలితాంగికి, మా యలమేలుమంగకున్
బొమ్మలు బొమ్మపొత్తికలు బోనపుదొంతు, లటంచు నీసతిన్
నెమ్మిభజించి మ్రొక్కుదురు నిర్జరకాంతలు వేంకటేశ్వరా!



ఉ॥ ఓ కమనీయచంద్రముఖి! యో వలరాయనితల్లి! యో సుధా
సైకతచాతురీజఘనచక్రిణి! యో యలమేలుమంగ నీ
వే కరుణించి కావుమని వేడ్కల నింద్రపురంధ్రు లందఱున్
బైకొని నీలతాప్రతిమఁ బ్రస్తుతి సేతురు వెంకటేశ్వరా!

ఉ॥ ఓ లలితాంగి! యో కలికి! యో యెలజవ్వని!యోవధూటి!యో
గోల! మెఱుంగుఁజూపుకనుఁగోనల నో యలమేలుమంగ! మ
మ్మేలినతల్లి! నీ విభునకించున కించుక మా దెస!జూపు మంచు నీ
పాలికిఁ జేరి మ్రొక్కుదురు పద్మభవాదులు వేంకటేశ్వరా!

చ॥ సరసిజసంభవాది దివిజప్రకరంబుల సంపదల్ సువి
స్తరములుగాఁగఁ గన్గొనలఁ జల్లెడు శ్రీయలమేలుమంగ నీ
తరుణియురంబునం జెలఁగఁ దన్మయమందెడు నీకుఁ బ్రాతియే
పరమపదప్రభుత్వము నపారమహత్త్వము వేంకటేశ్వరా!

చ॥ తరుణి! మహానిధానమ! సుధామయకూప! సమస్తవైభవా
భరణమ! దేవదేవుని కృపామతి యో యలమేలుమంగ! నీ
కరుణయచాలు లోకములుగావఁగ నంచు మునీంద్రులున్ సురల్
నిరతి నుతించి మ్రొక్కుదురు నీప్రియకాంతను వేంకటేశ్వరా!

ఉ॥ నించిన పంచదారలును నేతులుఁ దేనెలుఁ గమ్మఁగాఁగఁ దా
లించిన కూరలున్ బరిమళించఁగ నయ్యలమేలుమంగ వ
డ్డించిన నిర్మలాన్నములు డెందమెలర్పఁగ నారగింతు నీ
మించిన వేయుఁజేతులను మేలములాడుచు వేంకటేశ్వరా!

ఉ॥ ఆతఁడె నీవు నీవనఁగ నాతఁడె నీపలుకే తలంపఁగా
నాతని పల్కు నీ హృదయ మాతఁడె పో యలమేలుమంగ నీ
చేతిదె సర్వజంతువులజీవన మంతయు నంచు సన్ముని
వ్రాతము సన్నుతించు ననివారణ నీ సతి వేంకటేశ్వరా!

చ॥ నెఱి నలమేలుమంగకును నీకును బద్మభవాండభాండమే
మెఱసిన బొమ్మరిల్లు తగుమేడలు మీఁదటి లోకముల్ ప్రభల్
తెఱలఁగ మించు నయ్యినుఁడె దీపము గుజ్జెనగూడుచంద్రుడే
తొఱలిన దేవసంఘములె తొత్తులు బంట్లును వేంకటేశ్వరా!

చ॥ వడి నలమేలుమంగ నిడువాలికచూపు నివాళి నీపయిన్
నుడిసిన తమ్మితేకులు ప్రసూనశరంబులు గల్వతేకులున్
బడిబడి మీఁదమీఁద రసభావనగా దిగఁబోసినట్ల పో
పొడవగు పువ్వుఁజొంపముల పూజలు నీకును వేంకటేశ్వరా!

చ॥ ఇతఁడలమేలుమంగవిభుఁ డీతఁడె పో కలశాబ్ధికన్యకున్
సతతముఁ జిత్తమిచ్చిన రసజ్ఞుఁడు ప్రాజ్ఞుఁడు సర్వవైభవో
న్నతుఁడు రమాసతీప్రియుఁడు నందకశార్ఙ్గధరుం డటంచు ని
న్నతివలు మెచ్చి మెచ్చి కొనియాడుదురెప్పుడు వేంకటేశ్వరా!

చ॥ నిగిడి పయోధిఁద్రచ్చునెడ నిర్జరసంఘము నిక్కి చూడఁగా
ధగధగమంచు దిక్కుల నుదగ్రతటిల్లతలుల్లసిల్లఁగాఁ
దగ నుదయించి మించిన సుధాప్రతి మీ యలమేలుమంగ నీ
మగువ యటంచు మెత్తురు సమస్తమునీంద్రులు వెంకటేశ్వరా!

ఉ॥ పచ్చలసందిదండలును బాహుపురుల్ మణినూపురంబులున్
మచ్చరికంబులున్ బసిఁడిమట్టెలమ్రోఁతలుఁ బెల్లు మ్రోయఁగా
నెచ్చెలు లోలిఁగొల్వఁ దరుణీమణి శ్రీయలమేలుమంగ నీ
ముచ్చటదీర్చు నొక్కపరి ముందఱ నిల్చిన వేంకటేశ్వరా!

ఉ॥ యోగ్యత లేని కష్టుఁడ నయోగ్యుఁడ నన్నిటఁ జూడ గర్భని
ర్భాగ్యుఁడ నీకృపామతికిఁ బ్రాప్తుఁడ నోయలమేలుమంగ నీ
చూచు కృపానిరీక్షణమె చూచెద నంచును నీ ప్రియాంగనన్
బూచినవాక్ప్రసూనములఁ బూజలు చేసెద వేంకటేశ్వరా!

# 11
# కృష్ణకవి.

ఈకవి 18వ శతాబ్దమువాఁడు కాబోలు. తండ్రిపేరు నరసింహార్యుడు. తల్లిపేరు, జన్మస్థానము నివాసస్థానముగాని తెలియరాదు. చిఱుమామిళ్ల పాపయ్య ప్రభుని యాస్థాన కవీశ్వరుడనని చెప్పుకొన్నాడు. కాబట్టి, కృష్ణాజిల్లావాఁడు కావచ్చు. ఈతఁడు మఱేగ్రంథమును రచించి నట్లెఱుఁ గరాదు. కాళిదాసుని శాకుంతలమును పద్యకావ్యముగా రచించినట్టున్నాడు. ఈ గ్రంథము శ్రీవెంకటేశ్వరున కంకితమీయబడినది.

## శకుంతలాపరిణయము

శా॥ శ్రీవత్సాంక, లసద్భుజాంతరయుత, స్వీయోరుహారాగ్ర రే
ఖావిశ్రాంతి నెసంగు తత్కుచతటిన్ గైసేయు కాశ్మీరసం
భావంబుల్ తనమైఁ బొసంగ నలమేల్మంగాభిధానేందిరా
దేవిం గౌఁగిటఁ జేర్చు వెంకటపతిన్ ధీయుక్తిఁ గీర్తించెదన్.

సీ॥ ఏ దేవదేవుని సాదరాలోకంబు
లకంబులకు సౌఖ్య మాకలించు
నే పరాత్పరు దివ్యరూపానుభావంబు
భావంబులకు మేలు పాలుకొలుపు
నే జగజ్జనకుని యిచ్ఛావిహారంబు
హారంబు ధారుణీచారుముఖికి
నే మహాబలశాలి హేలావతారంబు
తారంబు విష్టపత్రయమునకును

గీ॥ నే సుధీనిధి కరిగాపులై సుఖింతు
రంగబంగాళచోళ కళింగవంగ
గౌళపాంచాలనేపాళమాళవాంధ్ర
శకయుగంధరముఖ్యదేశముల నృపులు

శా॥ ఆ విన్నాణపు వేలుపుందొర ప్రపన్నానీకముల్ గొల్వఁగా
శ్రీవైకుంఠపురంబు వెల్వడి లసచ్ఛృంగారుఁడై యిందిరా
దేవిం దోడ్కొని స్వామిపుష్కరిణికాతీర ప్రదేశంబునన్
భావింపందగు హేమసౌధమున శుంభల్లీల వర్తించుచున్

సీ॥ ఆమోదమున రమారామాలలామంబు
మెఱుఁగారు నురముపై మెఱుఁగు లీన
నహితలోకైకదుస్సహసహస్రారంబు
లాలితంబగుచుఁ గెంగేల నమర
ఘనతరామల కనత్కకోత్తరాసంగ
దీధితి యొడలిపైఁ దేజరిల్ల
భూరిగైరికచారుహీరకోటీరంబు
కొమరారు నుత్తమాంగమునఁ దనర

గీ॥ లలితధాతువిచిత్రశిలావిశేష
శేషగిరి, శృంగశృంగార, చితనిశాంత
బహుళమణిరాజరాజిత, భద్రపీఠి
సరసగతి వేంకటాచలస్వామి వెలయు.

చ॥ సనకసనందనాదిమునిసన్నుతపాద రమావినోద కాం
చనమయవాస శత్రుజనశాసన దాసనమస్క్రియాప్రియా
వనరుహనేత్ర పత్రరథపత్ర పవిత్రచరిత్ర సామగా
యనఘన శేషశైలనిలయా వలయాదివిశేషభూషణా!



చ॥ హరిహరినాగనాగపశతారకతారకతారతారకా
శరశరదిందుకుందహరిచందనచందనభారభారతీ
వరవరవాజివాజిరథవాసభవాసమృణాళనాళవి
స్తరతరకీర్తికీర్తితసదానసదానన వేంకటేశ్వరా!

# 12
# వేంకటాచలవిలాసము.

ఈ గ్రంథకర్త నామ, దేశ, కాలాదులేవియు నెఱుఁగరావు. రచన ప్రశస్తమయినందున నిందు జేర్చుటయినది. దీని మాతృక తంజావూరి సరస్వతి మహలులో నున్నది.

కII శ్రీకాకులవల్లభుని ని
రాకులమతిఁ బూజసేసి యా హరిదయఁజొ
క్కాకులజోకన్ దూలన్
గాకర్మములెల్ల హర్షకలితాత్మకులై.

కII అల మును లెదుటం గాంచిరి
కలహంసారావవాణిఁ గమలజపాణిన్
బులినశ్రోణిన్ దతశై
వలవేణిన్ కృష్ణవేణి వారిధిరాణిన్.

ఉII అన్నదిచెన్ను కన్నులకు నామతిసేయఁ గృతావగాహ నో
త్పన్నమహాప్రబోధరసపారగులై మతివార్ధిపొందు గై
కొన్న యనేక వాహినులఁ గోరిక లీరిక లెత్తఁ గ్రుంకుచున్
వెన్ననికిన్ దివాణమగు వేంకటశైలముఁ జూచువేడుకన్

చII చనిచని కాంచి రా దివిజసంయములందఱు ముందఱన్ గన
త్కనక మణిప్రభాజనకధాతుగుహాతటశృంగసాలమున్
జనజ నిబంధనేంధన ధనంజయదంచిత తీర్థజాలమున్
సనకసనందనాది మునిసంస్తుతశీలము శేషశైలమున్

వII ప్రవేశించి తత్పురోభాగమ్మున.



సీII పొదుపుగుబ్బలిమీఁదఁ బొడుచుభానునిలీల
గల కిరీటము తలఁ గలుగువాని
అరచందురుని వెన్నుసఱఁచునెన్నుదుటిపై
ముత్యాలతిరుమణి మురువువాని
మొసలివామించుల మిసమిసల్ దీపించు
నొసపరి కుండలయుగమువాని
సెలవులతుదకెక్కు చిరునవ్వుడాల్ డెక్కు
తళుకులేజెక్కుల కులుకువాని

గీII కలువతామరకొలముల వలవఁ జేయు
చూపులను చలివేడియుఁ జూపువాని
విమలలావణ్యజలనిధి వేలఁబొడము
పగడమన నొప్పు వాతెఱ సొగసువాని.

సీII కరశంఖమునకు నేకగ్రీవమను రేవ
గల గ్రీవచెలువులఁ జెలఁగువాని
తనువెత్తకీర్తి ప్రతాపంబు లన మించ
కరగతశంఖచక్రములవాని
నాకల్పఫలమిచ్చు నా కల్పశాఖల
దాయాదులౌ కేలుదోయివాని
నలకనిర్జితభృంగయౌ నలమేల్మంగ
కిరవైన పచ్చని యురమువాని

గీII కోరి యిరుదుగమొగముల కుఱ్ఱగన్న
యమ్మదానగు పొక్కిటి తమ్మివాని
ఘోరదానవవిపినకుఠారమైన
బలుకఠారంబు కటితటిఁగలుగువాని.

సీ॥ బంగారుమ్రాఁతచెఱంగుల రంగారు
పట్టుదుప్పటి కటిఁగట్టువాని
పద్మపద్మప్రభాస్పదపాదవేదమం
జీరమ్ములను విలసిల్లువాని
అతుల చిరత్నరత్నాంశుజాలముల మిం
చులమించు మించుల నలరువాని
శాంతశృంగార రసశ్రీల నెలవైన
మెఱుఁగుజాఁమనచాయ మేనివాని

గీ॥ సర్వగీర్వాణసముదయసార్వభౌమ
బిరుదుగలవాని విఖ్యాతి వెలయువాని
శుభగుణావాలు నిర్జరస్తుతివిశాలు
వితతకరుణానివేశు శ్రీవెంకటేశు.

సీ॥ మొలకతారపుటెక్కు గలవాని గలవాని
నెనరువాని పొగడ్త దనరువాని
దయతోడకూడు చేతనవాని తనవాని
తనయంతవానిగా నునుచువాని
పదములఁబొదలు నాపగవాని పగవాని
బురకని మనిచిన బిరుదువాని
నెమ్మోవినగవు వెన్నెలవాని నెలవాని
చెలికన్నుదోయిగాఁ జెలఁగువాని

గీ॥ నంబుదపు డంబుమీఱు గాత్రంబువాని
కొండనక కోర్కికొండను కొండవాని
నిలువుగల పైఁడిచెలువుల వలపువాని
మేలు సమకూర్చు నలమేలు మేలువాని.



సీ॥ తలనిల్లుగట్టువ్రతమ్ములరాయని
తోమని పళ్యాల నేమగాని
చేరెడుబియ్యాల యోరెము దినువాని
కోణంగిసేవల నాణెగాని
కానుకలకు వడ్డికాసులు గొనుతేని
ముక్కోటితీర్థపుఁ డెక్కులాని
యడుగడుగుకు మ్రొక్కులందెడి దేవుని
కూకటిమాడల గుత్తగాని

గీ॥ శుక్రవారపుసేవల సొగసువాని
మానినుల కోరి వలపించు మాయలాని
తిండిమెండయగారిని తిగళగురుని
కాంచి సేవింప సంతోషకలితు లగుచు.

సీ॥ అభివాదనము వృషభాఖ్యమహాహార్య
నవ్యకూటాగ్రవాస్తవ్యునకును
దండంబు గరుడాభిధానశైలమణీ వి
భాసమానస్వర్ణ భవనభర్త
కంజలి శేషనామాధిక్యధరణీ ధ
రాధిత్యకా గృహమేధిమణికి
వినతి శ్రీ వెంకటవిఖ్యాతనామధే
యాచలహేమగేహ కులపతికి

గీ॥ చిన్నిపూ వంజనాద్రిప్రసిద్ధనిధికి
శరణు గృహసరసీకేళిసక్తమతికి
మోడ్పుగేలు త్రిమూర్తుల మొదలిదొరకు
వెండియు జోహారు వినతవేదండునకును.

సీ॥ సర్వేశ, సర్వాత్మ, సర్వగుణాతీత
సర్వజనావన సదయహృదయ
గోపాలగోపాల గోపనధౌరేయ
గోగోప గోపికా భాగధేయ
వారణదైన్యనివారణ వారణ
శిక్షణ దక్షిణసింహశౌర్య
శేషాచలేశయ శేషలోక నివేశ
శేషశరీర విశేషతల్ప

గీ॥ నీలనీరదనీరధి నీలగాత్ర
తీర్థతీర్థమహాతీర్థతీర్థపాద
నంద నందన సనకసనందన నుత
శరణుశరణయ్య శరణార్థిశరణు శరణు.

మ॥ సవరక్షాచణ సామగేయ సితభాస్వద్ ద్వీపసీతేశ రూ
పవరేణ్యా సుచరిత్ర సూరిజనభావ్యాసేవనాసక్త వా
సవముఖ్యామరసైంధవత్పదసరోజా! సోమవాణీశ సం
స్తవ సౌమ్యాత్మక సంగదూరతర సర్వప్రాణి సంరక్షకా.

సీ॥ భువనముల్ పుట్టింప పోషింప నణగింప
కర్తయైన ప్రధానమూర్తి వీవ
మస్తకముఖ్య సమస్తాంగబహులత
లక్షింపదగు జగత్కుక్షి వీవ
కొల్చువారికి గోరిన కోరికెల్ దయసేసి
రాజిల్లువేల్పులరాజ వీవ
యజుఁడు రుద్రుండు నింద్రాదులాదేవతల్
గూడనెఱుంగని ప్రోడ వీవ?



గీ॥ తలపులొడ్డి యీతాపసావలికిఁ జూడ
నలవిగానట్టి బ్రహ్మంబవయ్యు నీవ
శంఖచక్రగదాఖడ్గశార్ఙ్గ చాప
భూరి విస్ఫూర్తికీర్తిత భుజుఁడ వీవ.

క॥ ఈశైలవైభవం బీ
దేశిక సౌభాగ్య మీ సుతీర్థమహత్త్వం
బీశౌరి కరుణ గురు వా
గీశఫణీశులకు నయిన నెన్నగఁదరమే.

ఉ॥ ఏమి తపంబొనర్చితిమొ యే సుకృతం బొనరించినామొ యే
నోములు నోచినారమొ మనోరథముల్ మదిదేటువారగా
కామిత దానపాటవము గల్గిన తండ్రిని వెంకటాచల
స్వామిని చూడగంటిమి శుభమ్ములుగూడ నఘమ్ములూడగన్

సీ॥ అనుచు లోననుచు మహానురాగమ్మున
తనిసిపల్కుచు గరీంద్రమ్ముడిగ్గి
తద్దక్షిణమున విధాతు కమండలు
నాళంబు వెడలు స్వర్ణదితెఱఁగున
భూరి తటోద్ధతిపొలుపొంది యఘహ
వారియౌ నయ్యాళువారితీర్థ
మటఁగాంచి తానములాఁడి కౌశికదిక్త
టాంచల వసదనలాక్షుఁ గొల్చి

గీ॥ భక్తి గోవిందరాజుల ప్రణుతిదెల్పి
యాయచలసార్వభౌముని బాయలేక
చెనగు నాలోకనముల నొయ్యనమరలిచి
మినుకుటందియదోయిసామిని దలఁపుచు.

## 13
## గణపవరపు వెంకటకవి.

ఈతఁడు 17వ శతాబ్దపువాఁడు. తండ్రి అప్పయార్యుఁడు. తల్లిమంగమాంబ. స్వగ్రామము కాటెపలీ మజరాగ్రామమగు గణపవరము. ప్రబంధరాజవిజయవేంకటేశ్వరవిలాసము, ఆంధ్రకౌముది, ఆంధ్ర ద్విరూపకోశము మొదలుగాగల గ్రంథముల నిర్వదియైదింటిదాకా రచించినాఁడు. ఈ స్తుతి పద్యములు ప్రబంధరాజవిజయ వేంకటేశ్వరవిలాసము లోనివి.

## శ్రీప్రబంధరాజవిజయవేంకటేశ్వర విలాసము.

ఉ॥ శ్రీలలనామణీ ముఖవిశేషవికస్వర లోచనాబ్జ వీ
క్షాళిమదాళిమేచకవిభాన్వితమై తగుపారిజాత పు
న్మాలిక గల్వపూసరముమాడ్కి భుజాంతరపాళి మీఱను
ద్వేలదయాసనాథుఁడగు వేంకటనాథుఁడు మమ్ముఁబ్రోవుతన్

సీ॥ రతికి భారతికి మేరలు నియోగించ నె
చ్చరిక నెమ్మదిఁగొన్న గరిత మిన్న
గారాబమునఁ బాలకడలి ముద్దులు సేయ
నలరునిల్లంట్రఁపు టాఁడుబిడ్డ
కలుముల వెదచల్లు కడగంటిచూపుల
మగనిఱొమ్మెక్కిన మాయలాఁడి
చెలికత్తె యగు మంచుమలపట్టి పోరామి
గీలుఁగొల్పిన రాయగేస్తురాలు.

గీ॥ తన కడుపు సల్లఁగా జగత్త్రయముఁ గన్న
తల్లి జాబిల్లికినిఁ గూర్మిచెల్లెలయిన
మంగళాకార యలమేలుమంగ నాదు
తలఁపు లీడేర్చి మా యింట నిలచుఁగాఁత!



సీ॥ కొండలరాయనిఁ గొలుచుకవులకు బం
గారంపుముడుపు మోకాళ్లముడుపు
పరమదాసవ్రాతపాపంబు లెల్లను
గడలకుఁ దుడుపుమోకాళ్లముడుపు
దిటమున నెక్కునెంతటివారి కొదవించుఁ
గన్నంత జడుపు మోకాళ్లముడుపు
నానాదిగాగత నరసంతతికిఁ బున
ర్గమనంబు ఉడుపు మోకాళ్లముడుపు

గీ॥ తడుపు లిడనట్టిమేనులు నిడుపుఁజూపు
నొడుపు మదినెంచి తపములు గడుపుమునుల
పొడవులెఱిగించు జీఁకటినిడుపుగుహల
కడుపొలుపలరునిడుపు మోకాళ్లముడుపు.

క॥ కోరి తలచెండ్లు దాల్చిన
వారును నడుగడుగు మ్రొక్కువారును ప్రాణా
చారములెల్లెడ నొరఁగెడు
వారును తీర్థములు వచ్చువారైరెందున్.

సీ॥ అభయంబులిచ్చు మా యిభరాజవరదున
కుభయంబు లొనరింపుచున్న వారు
వెఱపులుమాన్పు మా వెంకటేశ్వరునకుఁ
జఱపులు భయభక్తి జఱపువారు
ఘనయోగిజనసమావనయోగి కనుమ్రోల
వినియోగములు సేయుపనుల వారు
దురిత రుజౌఘవైద్యునికి హృద్యముగా ని
వేద్యము లొసగంగ వేడు వారు

గీ॥ పరులంఁబొరి గొనుజోదుకు పరులు, నరుల
దోసములు దోసు నయ్యకుదోసెలలరు
నప్పనికి నప్పము, లతిరసాధిపతికి
నతిరసంబుల నిచ్చువారైరి వరుస.

సీ॥ బడలినవారికి వడపప్పు పానకా
లనఁటిపండ్లోపినయన్ని గలవు
యెళనీరు బిసనీరు లెందు హేరాళంబు
నీరుచల్లఁ బెరుగపార మఁచటఁ
గప్పురగంధంబు కైరవల్పట్టీలు
తట్టుపునుంగును జుట్టుపూవు
లెందువేడిన వెల్లయేచప్పరంబున
విప్పైన గొడుగులు విసనకఱ్ఱ

గీ॥ లేలకులు శొంఠియును లవంగాలు పనస
తొలలు చెఱుకులు ఖర్జూరఫలము లెన్ని
వేడినను గొండనుచు జాటు వేంకటేశు
భక్తజాలంబు తిరునాళ్లప్రజకు నపుడు.

సీ॥ అలమేలుమంగామనోబ్జభృంగ పరాకు
యహరహర్దానవహర పరాకు
శ్రీతిరుపతిమహాసింహాసన పరాకు
దివిజాధినాథవైభవ పరాకు
సకలభక్తజనరక్షణ విచక్షణ పరా
కజరవందితపదాంబుజపరాకు
కమనీయసందీప్తగరుడవాహ పరాకు
శతకోటిమన్మథాకృతి పరాకు



గీ॥ దేవరపరాకు తిరుమలాధిప పరాకు
మాయురేస్వామి చాంగుభళా యటంచు
మాగధులు చేరి సముఖంబు వేగవిప్ప
నలువు మీఱంగ నిజవాహనంబు డిగ్గి.

సీ॥ కలిమివాల్గంటితోఁ జెలిమి చేయనిమేలు
జులిమివావిరిజూపుబలిమి వాఁడ
మెదదవాటిలుకిత్తు వెడదవావడిగ్రోలి
బెడదవాపెడు గొప్పయెడద వాఁడ
పులుఁగువార్వము నూని యలుగువారల జెండ
గలుగు వాటంపు చుట్టలుఁగు వాఁడ
కరమువాదిడుమామ యురమువాలించు మొ
క్కరమువారని మేలికరము వాఁడ

గీ॥ జారిపోరోగిరపుజడదారి మన్నె
పాటపాటాన విని సొక్కు బోటువాఁడ
సొగసుకాటుకపేరి గొండగవిదారి
నోమినెక్కొన్న నలరూపుసామి మిన్న !

సీ॥ తులలేని పెందళ్కు నలమోముజిగి పిల్ల
తుమ్మెద నునుబొజ్జతమ్మి వాఁడ
జగజోతి చేబొక్కసాదర మిడి వేడి
చూపుల మైసొమ్ములేపు వాఁడ
యిత్తికతల యెన్నునీను చూలాలు వా
విరిబూచుతటి రెప్పవిప్పు వాఁడ
తావితాల్పరిపగదాయ కూటపుదిండి
రెక్కకట్టెరపక్కిజక్కి వాఁడ

గీ॥ నెగడుతిగలేని తపని కంటిపొద బువ్వ
మన్నెవారిదు పొగడిక గన్నవాఁడ
సొగసుకాటుక పేరి గొండగవిదారి
నోమి నెక్కొన్న నలరూపుసామిమిన్న !

సీ॥ గుడుగుపాల్ మబ్బుఱాపిడుగు వానకు గట్టు
గొడుగువాటము దాల్చు వడుగువాఁడ
నుడుగువాల్ గమి మైలగడుగువారి మెఱుంగు
లుడుగువారని వ్రేలి మడుఁగు వాఁడ
పడుగువాలిక నని చెడుగువారిని చెండ
పొడుగువా నగు కత్తిదొడుగు వాఁడ
వడుగువాకుగ బలినడుచు వాకునఁ జేరి
యడుగువాలఁగ ద్రొక్కు నడుగు వాఁడ.

గీ॥ నడుగు వదలని జగజెట్టి ముడుగుటకును
చిడుగుడున గరిడినడచెక్కు డగు వాఁడ
సొగసుకాటుకపేరి గొండ గవిదారి
నోమి నెక్కొన్న నలరూపుసామి మిన్న.

సీ॥ చాగపు పొలదిండిపాహెబు తలమాని
కపువిను కొమరుపొగడ్తవాఁడ
ననుమీనుమనుమని నుడిపంటవ్రాయుమేలన్
దంటగన్నతుపాసిబంట వాఁడ.
మోదుగనునుమొగ్గముక్కు చక్కనిపక్కి
నెక్కునెక్కటిగేరు టెక్కువాఁడ
తపసిరాచందుడెందపుతమ్మిముద్దియ
పయి నంగుగమెలంగు మయిమవాఁడ.



గీ॥ కోరి యనయంబు ప్రామిన్కు కొనలు దెల్ప
లేని వలకారిజిగిరూపు మేనివాఁడ
సొగసు కాటుకపేరి గొండ గవిదారి
నోమి నెక్కొన్న నలరూపుసామి మిన్న.

సీ॥ బలితంపువలపుదాల్పరి దిండిగమితావు
గలదొర వాకిట నిలుచు వాఁడ
చాగపు ననదోట సామింటజాలీను
బాలెంత యగు బొటవ్రేలివాఁడ
పాలేటిరాయని పాపనిసైఁదోడు
పెద్దకొల్విడు రొమ్ముగద్దెవాఁడ
బెడగు చెంబడిబిడ్డ కడుపున బొడమిన
జడదారి వడిసుడి నదరు వాఁడ

గీ॥ వెల్లసుడిచుక్క తలగోము బొల్లిమోము
పక్కిరామూపు నడిచక్కి నెక్కువాఁడ
సొగసుకాటుకపేరి గొండగవిదారి
నోమి నెక్కొన్న నలరూపుసామి మిన్న.

సీ॥ జాలువ్రేలును సంకుగ్రాలుడాలును బిల్ల
రాలు కేలునుగల బాళి వాఁడ
పాలుప్రోలును పుల్గుడాలుమేలును
పచ్చదేలుసాలునుగల హాళివాఁడ
మేలుకోలును జగమేలుకీలును
కల్మిజాలు నాలునుగల లీలవాఁడ
వాలుడాలును మున్గుచేలుప్రాలును వేల్పు
చాలు మేలునుగల వేలవాఁడ

గీ॥ రేలును బగళ్లు నెఱజగడాలుబన్న
పాలువడుగాణ పొగడత సోలువాఁడ
బేలుపోవని పొలదిండ్ల నూలు కొనుచు
దీలువడగొట్టు నట్టి గగ్గోలువాఁడ

సీ॥ శ్రీమించు బంగరు చిఱుగజ్జెలడుగులు
వరదకరము కటివామపాణి
పీతాంబరమ్మును పిడెముపొక్కిటితమ్మి
విశ్వంబులిడు బొజ్జవెడఁదయురము
చెంగట నలమేలుమంగ శ్రీవత్సంబు
శంఖచక్రాంకహస్తద్వయంబు
భుజకీర్తులును గళంబున తుళసీదళ
మాలిక వీనుల మకరకుండ

గీ॥ లములు నునుమోవి చెక్కులు కొమరుముక్కు
తీఱు దయలీనుకన్నులు తేట యగు మొ
గము కిరీటంబుగల మిమ్ముఁగంటి మిపుడు
జలజహితధామ వెంకటశైలధామ.

సీ॥ తోమని పళ్యాలతోడఁ జేఱుదుబియ్య
ము పసాదము మెసంగుముదుగుఁదలఁచి
యెద్దెల బెదరించి యొడ్డికాసులతోన
కానుక ల్గొనెడియాగడముఁ దలఁచి
శ్రీవైష్ణవాగ్రణి సేయు కుళమునకు
మనుమోయు నంబేదతనముఁ దలఁచి
తనయంత కులకాంత నెనసియు వేఱొక్క
మదనాలిఁ గైకొన్నయగడుఁ దలఁచి



గీ॥ తాళునే యలమేల్మంగతాయి యిన్ని
దలఁచియే కాదె యనఁటిబొందెలను నీకు
బుద్ధిచెప్పించెఁ బెండ్లిలోఁ బద్దుమీఱి
జలజహితధామ వెంకటశైలధామ.

సీ॥ మునుపుగా నెంగిలిఁ దినిపించు శబరికిఁ
దండ్రివై నేరముల్దలఁచి మనుప
నెన్నులొసంగిన యెఱుకల గమికాని కే
మౌదులే కోర్కెలెల్ల నొసఁగఁ
బడితరంబులు కొంచెపఱచి సొమ్ములు నాచు
పాదుషా నీసరిపాలివాఁడె
చూఱగా సీమంతపారుపత్యముసేయు
వాఁడు నీకును జెలికాఁడె తలఁప

గీ॥ వారియేలిక వీవా నీవంటివేల్పు
వేఱొకఁడొ తెల్పవే కొల్వు వెదకవలయుఁ
దప్పులెన్నక రక్షించుదాత నొకని
జలజహితధామ వెంకటశైలధామ.

సీ॥ అతులితోన్నత తిరుపతి పరిపాలన
విభవోన్నతుండవై వెలసికాక
యేరిని నేరుపునేరంబు లెంచక
నుభయలోకసుఖంబు లొసఁగిగాక
మహిమ యలర్మేలుమంగ యిల్లాలుగా
మునునోఁచు పుణ్యవాసననుగా
చేఁదోడువాఁదోడునై దయనెవరు పి
ల్చిన తోడ మాటలాడననెగాక

గీ॥ దేవుఁడ నటన్న నూఱక తీఱు నెట్లు
చెల్లఁబోఁ నీకు నొకనికిఁ జెల్లుఁగాక !
తండ్రివీ వలమేల్మంగ తల్లిమాకు
జలజహితధామ వెంకటశైలధామ

సీ॥ ఆగమాంతార్థరహస్య మావాలంబు
ప్రణవంబు కూఁకటిబలిమివేఱు
పెనుమొదల్ భువనమోహనమైనకాయంబు
కరచతుష్టయము శాఖాచయంబు
వనమాలికయుఁ బల్లవశ్రేణికౌస్తుభ
ము సుమంబు వినువాఁక పువ్వుదేనె
పయినల్లులేతతీవియ యలమేల్మంగ
భక్తులఁ బ్రోఁచుట ఫలముగాఁగఁ

గీ॥ గలుఁగు నీపేర వెలసినకల్పకంబు
నా మనంబనునందనారామసీమ
పాదుకొనుఁగాక సకలవైభవసమృద్ధి
జలజహితధామ వెంకటశైలధామ.

# 14,15
# తిరుపతి వేంకటేశ్వరకవులు

వీరు 19వ శతాబ్దము తుది భాగమునను 20వ శతాబ్దము తొలి భాగమునను వర్తిల్లినవారు. దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారును జంటకవులు. వీరిరువురకే తిరుపతి వెంకటేశ్వరు లనివేరు. తిరుపతిశాస్త్రిగారి తండ్రి వెంకటావధాని తల్లి శేషమ్మ. వీను జల్లిసీమకాపురస్థులు. ఎండగండినివాసులు. కాకినాడలో పోలవరము జమీందారువారి యాస్థాన విద్వత్కవులుగానుండిరి. వెంకటశాస్త్రిగారి స్వగ్రామము గోదావరిజిల్లా కడియం. తండ్రి కామయ్య. తల్లి చంద్రమ్మ. ఈ జంటకవులు శతాధిక గ్రంథకర్తలు. ఈ స్తుతిపద్యములు నానారాజ సందర్శనములోనివి కొన్ని. వీరు (వెంకటశాస్త్రిగారు) 1936 సం॥ వెంకటేశ్వరస్వామిని దర్శించినప్పుడు చెప్పినవి కొన్ని.

చ॥ వసుమతినెల్లచో సపరివారముగా విహరించు నిందిరా
రసికున కాంధ్రకాననధరాధరసానువిహార లీల లిం
పొసగగఁ బోలు నాంధ్రకవితోక్తులఁ జేరికమైవినన్ ముదం
బెసగగఁ బోలుఁ గోరి వసియించెను శేషగిరిన్ ప్రసన్నుడై.

గీ॥ ఆ పరంజ్యోతి కుపనిషదర్థమునకుఁ
బేరుపెట్టిరి యాంధ్రులు వెంకన యని
అలజడులవేళ “గో” యని పిలిచి నంత
“ ఆ ” యనుచు బల్కి వెంకన్నయాదు కొనును.

ఉ॥ పోయిన ప్రాణమున్ మరలపోసి సుతున్ బ్రతికించి యిచ్చె ‘ అం
భా’ యని యీన మోపయిన యావు నదిన్ సుడిలోమునుంగఁ దె
ప్పైయొక యొడ్డు సేర్చెను దయానిధి వెంకటనాయకుండు మా
నాయన యంచు మ్రొక్కుదురు నమ్మినవారు విశుద్ధచిత్తులై

గీ॥ సచ్చిదానందు నిలయమ్ము సత్యలోక
మాఱులోకాలపై నున్న దనిరి బుధులు
వెంకటేశ్వరు భూతల విష్ణు లోక
మారుకొండలపైని ప్రత్యక్ష మగును

గీ॥ కమలబాంధవు కిరణాంకురములు శ్రీని
వాసు గోపురశిఖరసువర్ణకలశ
మూర్ధమును సోకి మెఱయకమున్న కొండ
చేరవలెనని సందడించెదరు జనులు.

చ॥ కడచినయాపదన్ కథలుగా సహయాత్రికుతోడఁ జెప్పుచున్
గడపిన వెంకటేశ్వరుని కారుణికత్వము నుగ్గడించుచున్
గడలు ప్రతిధ్వనింప భజనల్పచరించుచు నేడుకొండలున్
గడియలమీదఁ బ్రాకెదరు కంజదళాక్షుని భక్తులయ్యెడన్.

శా॥ దేవా! నీ శుభదర్శనమ్మునకు నా దేవేరి యత్నించియు
న్నేవెన్కంజను వేయు నక్కతమున న్నీ కొండకున్ రాదత
ద్భావంబెప్పుడు త్వత్పదాంబుజయుగీబద్ధంబ, అట్లౌటచే
నీవే యాపెకుఁ గొండనెక్కు సుకృతంబీవయ్య! యిప్డేనియున్

శా॥ నాకున్నీదగుపేరు, నీవెలదికిన్ గాంతాశిరోరత్నమౌ
నీ కల్యాణియభిఖ్య, నా సఖునకున్నీవుండునిక్కొండతో
నేకీభావముమూఁడునుంగలిగె నిందేమున్నదో మాయ! యీ
యేకీభావమ దెట్టిదో? యెఱుఁగుదీవే! వేంకటేశప్రభూ !

శా॥ నోరున్నెత్తియు మొత్తుకొన్నఁ బలుక న్నోరున్న దేవళ్లు లే
రేరున్నీవొకరుండుదక్కఁ గలిలో, నీలాటి నీదర్శనం
బారంజేసితి మున్నొకప్డు, మఱియిప్డానాటికీ నాఁడునీ
సౌరేనారయఁక గల్గితిన్ సుకృతినై స్వామీ! వృషాద్రీశ్వరా!



శా॥ నేనై నీ శుభ దర్శనమ్మునకు రానేలేను గంగాధర
శ్రీనాధుండటు " షష్టిపూర్తి" యనిపిల్చెన్నన్నుఁ, దత్కారణం
బై నాకబ్బెను నీదు దర్శనము దేవా! నేఁటిపున్నెమ్ము నం
దే నొక్కండునె కాదతండు గలఁడంచే విన్నవింతుం బ్రభూ

మ॥ వెనుకన్ శ్రీచెలికాని గోపవిభుతో విచ్చేసి నీపుణ్య ద
ర్శనముంజేసితి మేనుదిర్పతియు గోత్రమ్మం ధ్రుములన్మెట్టి నేఁ
డనఘా! దంటుకులుండు సుబ్బనవధాన్యగ్రేసరుం డంఘ్రి ఘ
ట్టన దోషంబది లేనిఫక్కి నిటుకొండన్ జేర్చెనో దేవరా!

మ॥ సతితో నీదగు దర్శనంబొనరుపన్ శక్తుండఁగానైతి, నా
మతికిన్ ధైర్యము గల్గదయ్యె క్షమియింపన్ వేడికొంచుంటి వృ
ద్ధత నానాఁటికి హెచ్చియున్ దుదకెటో ధైర్యమ్ము చేకూరె, వ
చ్చితిఁ బుత్రుల్ వెనువెంటరా నినుఁగనన్ శ్రీ వేంకటేశప్రభూ!

మ॥ ఎపుడేభాగ్యము చేకుఱన్ వలెనొ నీకేకాక మాబోటి మూ
ర్ఖపుఁగీటమ్ముల కెట్లుగోచరమగుం? గైకొమ్ము నామ్రొక్కు, లె
ల్లపుడున్నీదరి నున్నయట్లుగనె నన్నాత్మీయుగా నెంచి నీ
కృపకుం బాత్రునిగా నొనర్చుమని ప్రార్థింతున్ వృషాద్రీశ్వరా!

మ॥ అఱువైయాఱు ననంతరాబ్దమిదిగో నారంభమీనాఁటఁ జే
కుఱె నీ దర్శనమెంత పుణ్యదినమొక్కో నేడు శ్రీవేంకటే
శ్వర! నీ దర్శనమొక్క యీయిహమునన్ సౌఖ్యంబెకా కాపయిన్
బరమార్థమ్మును గూడ హస్తగతమై భాసిల్లఁగాఁ జేసెడిన్.

శా॥ " బాలాజీ" యని యొత్తరాహులు నినున్ వాకొంద్రు తద్వాచకం
బాలోచింపఁగ శక్తిబోధకమయౌ, నా యమ్మవే యౌదువో?
ఫాలాక్ష ప్రభునాత్మజాతుఁడల సుబ్రహ్మణ్యుఁడంద్రెందఱో
యేలా మాటలు, సర్వమీవగుదు, వించేశంకయో వెంకటా!

మ॥ అల రామానుజలేమొ నిన్ను హరిగా నంకించె నంచున్,శివ
స్థలమే మున్ననియున్ దదీయములు తత్తచ్ఛిహ్నాముల్ నేడునున్
గలవంచున్ మతికొందఱంద్రు నిజమో? కాదో?'జగన్నాస్తి" వా
దుల నద్వైతుల నేమిసేయునివి యెందున్ బ్రహ్మమే కన్పడున్

శా॥ డోలన్ జిన్నతనాన నెక్కితి నహో? 'డోలీ'ని నేడెక్కితిన్
"బాలాజీ" నినుంగనుంగొనెడి సద్భావమ్ముతో వార్ధకం
బోలిన్ "రెండవబాల్య" మంచనెద రార్యుల్ నేడు తార్కాణమై
నీలానాధ! భవత్కటాక్ష గరిమన్ వేనోళ్ల వాక్రుచ్చెడిన్

శా॥ 'రానేరా' నని పట్టుపట్టిన ననున్ రప్పించి యే తీరి తీ
వో నీలాధిప! వేంకటేశ్వర త్వదీయోత్సాహమేలాటి దో
కానీ భక్తు బరీక్షసేయుటకు నీకన్నన్ మఱొక్కండు లేఁ
డీనాటన్ "గలిదైవతంబ" వలనీవే దేవ! ముమ్మాటికిన్.

మ॥ నరసాభిఖ్య మహాకవీశు నసఘు న్నా పిన్నముత్తాత నీ
వెఱిఁగేయుందు, భవచ్చరిత్ర మతడెంతే సొంపుగా వేంకటే
శ్వర! కావ్యంబుగ 'వేంకటేశ్వరవిలాసం ' బంచు గావించె నో
సరసీజాక్ష! తదన్వయు న్ననుఁగృపన్ సాకంగఁ బ్రార్థించెదన్

మ॥ సతి ప్రేరేపె, భవత్పురస్థితము శిష్యవ్రాతముంగూడ న
న్నతిగాఁ గోరుచువచ్చె; నెందులకు సామర్థ్యంబు లేదంచు నే
సుతరామంటి ససేమీరా యని; కడున్‌జోద్యంబగు న్నేఁడెటుల్
కృతకృత్యుం బొనరించితో దరిసెనంబిప్పించి యప్పా ననున్.

( రెండవపరి దర్శించినప్పుడు చెప్పినవి. )

జూలై వేం॥ శా॥ శతవధాని.
1936 ' షష్టిపూర్తి ' నుండి



సీ॥ కాసుచొప్పున నింతగా నార్జనముచేసి
తెంతదెచ్చినను మాకింత లేదు;
గడగడలాడినిన్ గానంగనేతెంత్రు;
గానబోయిన మమ్ముఁ గాంచుటరిది
ప్రీతితో నీకు నర్పింతురెంతైన; మా
కింత యిచ్చియు నెంతు రెంతొయనుచు;
సేవించి నీకు వాంఛితము లిత్తురు; సేవ
కావించినను మాకుఁగాసు నీరు;

గీ॥ వేయిమాటల ఫలమేమి? పేరులొక్క
టైనను నదృష్టములు వేఱులై చెలంగు
సరస తిరుపతి వేంకటేశ్వర కవీంద్ర
శరణ! తిరుపతి వేంకటేశ్వర నమోఽస్తు.

సీ॥ ఆసించెదేలొకో కాసులార్జింపంగ
శుద్ధదారిద్ర్య విస్ఫూర్తి తనర
లక్షించెదేలొకో లంచమిచ్చినవారిఁ
బక్షపాతివిధమ్ము బయలుపడఁగ
హింసించెదేలొకో ఋణమిచ్చి నృపకోటిఁ?
బెద్దకోమటిసెట్టివిధము దోఁప
వసియించెదేలొకో పర్వతాగ్రమ్ముపై?
వేటలాడెడి బోయసాటి దెలియ

గీ॥ నాకు నివియన్నియును నవ్వునడకలంచు
దోఁచు, నీ చిత్తమున కేమిదోఁచు నొక్కొ?
సరసతిరుపతి వెంకటేశ్వరకవీంద్ర
శరణ! తిరుపతి వేంకటేశ్వర! నమోఽస్తు.

( మొదటి దర్శనం చేసినప్పుడు చెప్పినవి. )

నానారాజసందర్శనం
పూర్వార్ధము నుండి.

# 16
# వేటూరి ప్రభాకరశాస్త్రి

ఈపద్యములు శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు ద్వితీయ అన్నమాచార్యోత్సవ సందర్భమున శ్రీస్వామిని దర్శించినపుడు, వేసంగిసెలవులలో హిందూమతోపన్యాసము లొసఁగుటకు వెళ్లి శ్రీస్వామివారిని దర్శించినపుడు రచించినవి.

## తిరుపతికొండ

సీ॥ శృంగారరాయని చెలువు మీఱినకొండ
ఫణిరాజుపేరిటి పసిఁడికొండ
పుష్పజాతుల విష్ణుఁ బూజింపఁగలకొండ
కల్పవృక్షము లెల్లఁ గలుగుకొండ
చిలుకలు కోయిలల్ పలుకరించెడుకొండ
మృగరాజుకోటులు మెలఁగుకొండ
ఘోరదురిత మార్చు కోనేర్లుగలకొండ
తలఁచినమోక్షంబు గలుగుకొండ.

గీ॥ అమరవరులకు వైకుంఠ మైనకొండ
ఆళువార్లకుఁ బ్రత్యక్ష మయినకొండ
అరసి చూచిన బ్రహ్మాండ మైనకొండ
నేను పొడగంటి శ్రీవేంకటేశుకొండ.

## శ్రీవేంకటేశ్వరుఁడు.

సీ॥ అఖిలవిశ్వమున కేకాధార మర్వాప
తారమ్ము తానౌట తథ్యమగును,
అఖిలమై యాదిమధ్యాంతముల్ లోఁగొన్న
నిత్యంబు తా నౌట సత్యమగును,
అఖిలపూర్ణము సచ్చిదానందమయము నా
రాయణార్థకము తా నగుట నిజము
అఖిలజీవుల కాయురారోగ్యభాగ్యప్ర
దాత తానౌట యథార్థ మగును,



గీ॥ అఖిల మయి పొల్చు తనకల్మి నరయ నఖిల;
మఖిలము ఖిలమ్మె తలకల్మి నరయకున్న
నెవ్వఁ డవ్వాఁడ వీవెరావే, భయార్తు
నాదుకోవె ! వేంకటనాథ ! చేదుకోవె !

సీ॥ నిట్టనిల్వులు లోయపట్టులు కడునొాదు
దొడుకులు నగుమెట్టుత్రోవలందు
నడునడనడుఁకుచు వడఁకులు వాఱుచు
నెడనెడ నిట్టూర్పు లుడుపుకొనుచు
నేడుకొండలు నిన్నుఁ బాడుచుఁ గడచని
సోలుచుఁ జొక్కుచు నాలయంబు
చేరి యయ్యెడఁ గల్గుద్వారపాలకుల దం
డడి కోసరిల్లి లోఁగడకుఁ జొచ్చి

గీ॥ దివ్యభవదీయదృష్టి కందితిమి; కష్ట
పడక లభియింప దీశ్వరపద మటన్న
సూక్తి నిజమయ్యెనిన్ జూచి చొక్కినాఁడ
దక్కినాఁడ నీ, కిటుచూడు మ్రొక్కువాఁడ !

సీ॥ ఆకుఁజిల్కలు ఱెక్క లల్లార్చి యాడుచోఁ
బువ్వుల్ గుబాళించి నవ్వుచోట
పక్షులతో వృక్షపటలి వెల్విరియుచో
జంపతుల్ వాహ్యాళి సల్పుచోట
జలజల సెలయేళ్లు జాల్వారి దొరలుచో
నదులు సంద్రములతోఁ గదియుచోట,
ఏకాగ్రవృత్తి యోగీశ్వరుల్ వెలయుచో
నద్రిశృంగములు మిన్నందుచోట,

గీ॥ పుడమికి గుడారుగా మిన్ను పొలుచుచోట,
నాకసము భూమి యంటిసలాడుచోట
చొచ్చు లోలోని కెచ్చటో చొక్కుఁ దక్కు
నామనసు నీకు వేంకటానందనాథ !

సీ॥ వెలసితి వేడుకొండలమీఁద నూరును
బల్లెయు దరిలేని పట్టునందు
నెలకొల్పితివి దివ్యనిలయంబు లచ్చోట
బహుభోగభాగ్యముల్ పరిఢవిల్ల
రప్పించుకొనుచుంటి వెప్పుడుఁ గోటానఁ
గోట్లభక్తులను నీకొండదరికి,
రక్షించుచుంటి సర్వప్రపంచము మ్రొక్కు
లిడువారి కాపదల్ తొడరకుండ

గీ॥ ననుదినము వేనవేలు ద్రవ్యంబు సేక
రించుచుంటివి వడ్డితోఁ బెంచి పెంచి
నీ మహత్త్వంబు దెలియనౌనేమి స్వామి?
బిడ్డలను గావ నీకెంత జడ్డు దేవ !

శా॥ ఏవేవో వెతిమొట్టిచెయ్దములతో నీలోకతంత్రమ్ములన్
బ్రావీణ్యంబు గణింపఁజూచితిని వ్యర్థంబయ్యె; మేల్కొంటి,నీ
దేవా! సర్వము నీయధీనమగు టర్థిన్ గంటి, వెన్నంటి నీ
త్రోవన్ ద్రొక్కితిఁ జిక్కులుక్కడఁగెఁ దోడ్తో వేంకటాధీశ్వరా!

సీ॥ నగ్నస్వరూపసౌందర్యదర్శనవేళ
భైరవమూర్తివైభవముగంటి
క్షీరపూర్ణఘటాభిషేకసంభ్రమవేళ
జినదేవమూర్తివిన్ననువు గంటి
కర్పూరకస్తూరికాలేపనాభిషే
కమువేళ నౌమాపతమును గంటి
హైమోత్తరీయ సమర్పణార్పణవేళ
పరశక్తిమూర్తి సుందరత గంటి

గీ॥ మంగ తాళి ధరించి సర్వాంగశోభ
వెలయువేళ నీవిష్ణుత్వ మెలమిఁ గంటి
సర్వదేవతాత్మకమయి జరగు నీదు
శుక్రవారాభిషేక ముత్సుకతఁ గంటి.